నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 29-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:23 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

లావు చట్టాలు
ఆచరణ ఆమడ
లాభాలు శూన్యం

రాతలు గొప్ప
నీతి మంతుల పొత్తం
పల్లీ బఠానీ

గంజాయి సాగు
తూగడానికి బంగు
డబ్బు రవాణా

ఆగని పోరు
వర్గాల వివక్షత
యుగ యుగాలు

స్వేత పత్రాలు
ఆకు రాలిన కాలం
కొత్త దారులు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజం

నూటరవై ఐదు రోజులు
గడిపె తిహాడ్ జెయిల్
మంజూరు చేసే సుప్రీమ్
కోర్ట్, కవితకు బెయిల్
ఆధారాలు లేకున్నా
ఇవేమీ అలవాట్లు ?
అభియోగాలింకెందుకు
పెడుతుంటే చీవాట్లు ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

కబ్జాకోరులు ఎంతటి వారైనా వదిలేది లేదు

- ముందుగా మా పార్టీ సభ్యుడి ఇంటినే కూల్చాం
- అది మా నిబంధత..సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 28 :విద్యాసంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం: రేవంత్రెడ్డి హైదరాబాద్: ఎఫ్ఎఎల్, బఫర్ జోన్లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్చాట్ నిర్వహించారు. "సీడబ్ల్యూసీ సభ్యుడు పల్లంరాజు నిర్మాణాన్నే హైడ్రా మొదట కూల్చివేసింది. జన్వాడ ఫామ్ హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు? నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచులు కాదని ఆయనకు తెలియదా.. దానికి ఎటువంటి అనుమతులు లేవు.. చట్ట ప్రకారం ముందుకు సాగుతాం అని పేర్కొన్నారు రేవంత్.. తన కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తానని ఇందులో ఎటువంటి అనుమానాలు వద్దని చెప్పారు..

రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్ ప్రత్యేక దృష్టి
- తిరుమల తరహా నిత్యాన్నదానం
- శృంగేరి పీఠాధిపతుల సూచనల ప్రకారం విస్తరణ
- రవాణా శాఖ మంత్రి పొన్నం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 28 :(నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

పొన్నం ప్రభాకర్ తెలియజేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మాట్లాడుతూ వేములవాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఆలయంపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక భక్తులు వచ్చే ఆలయమని, ఆలయం మరింత అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యానికి అనుగుణంగా శాస్త్రోక్తంగా వేదపండితుల, శృంగేరి పీఠాధిపతి సలహా సూచన మేరకు ఆలయ విస్తరణ చేస్తామన్నారు. ఎమ్మెల్యే అది శ్రీనివాస్ తో కలిసి తిరుమలలో ఉన్న నిత్యాన్నదాన కార్యక్రమంలా వేములవాడలో కూడా నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. భక్తులు, దాతలు కూడా సహకరించాలని, రాబోయే కార్తీక మాసంలో నిత్యాన్నదాన సత్రం ప్రారంభించాలని అనుకుంటున్నామన్నారు.

తిరుమలలో వెంగమాంబ సత్రం మాదిరి వంటకి సంబంధించి అత్యాధునిక సామాగ్రితో సహా అన్ని ఏర్పాట్లు చేసే శక్తిని ఆ భగవంతుడు ప్రసాధించాలన్నారు. తిరుపతిలో అన్నదాన సత్రం ప్రారంభించిన ఎన్టీఆర్ ను జ్ఞాపకం ఉంచుకుంటామన్నారు. నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణం కోసం ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులు కోడె మొక్కులు చెల్లిస్తారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే భవిష్యత్ లో వేములవాడ గోశాలకి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారి శ్రీనివాస్ ను పంపించారన్నారు.

వేములవాడలో ఉన్న 2 ఎకరాల స్థలాన్ని టూరిజంకు అప్పగించామన్నారు. తెలంగాణలో రైతాంగం సమృద్ధిగా వర్షాలు కురిసి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ స్వామి వారిని కోరుకున్నామన్నారు. భక్తులు ఇచ్చిన కోడెలు పక్కదారి పట్టకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని కనుమరుగు చేసింది మీరే.. కెసిఆర్ సర్కార్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం..

- తెలంగాణ తల్లి విగ్రహ స్థాపనకు భూమి పూజ..
- లక్షల కోట్టు ఖర్చు చేశామన్నారు..
- తెలంగాణ తల్లి విగ్రహం మాత్రం పెట్టలేకపోయారు
- దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన నేత రాజీవ్ గాంధీ
- ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తే తప్పా
- బిఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ విమర్శలు
- ఆ తల్లికి సచివాలయంలో గౌరవం స్థానం కల్పించాం
- డిసెంబర్ 9న ఘనంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం

హైదరాబాద్, ఆగష్టు 28 :పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వచ్చిన అందరికీ అభినందనలు తెలిపారు. . హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహ స్థలంలో ఆయన నేడు లాంచనంగా భూమి పూజ చేశారు? ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తల్లి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించుకున్నామని, అయితే దసరా వరకు ముహూర్తాలు లేవని, ప్రసిద్ధ పండితుల సూచన మేరకు నేడు భూమిపూజ చేసినట్లు చెప్పారు.

పదేళ్లు ఏం చేశారు?.

పదేళ్ల పరిపాలనలో గత పాలకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు నిర్మించలేదని రేవంత్ ప్రశ్నించారు. . పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఎన్నో కట్టడాలు నిర్మించారని గొప్పలు చెప్పుకుంటారని, మరి తెలంగాణ తల్లిని మరిచాంన్నారని నిలదీశారు.. తెలంగాణకు మేమే సర్వం.. నేనే తెలంగాణ అనేలా గతపాలకులు వ్యవహరించారన్నారని మండిపడ్డారు.

గడీలు బద్దలు కొట్టాం..

కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అలాంటి విధానాలకు విరుద్ధమన్నారు. ప్రగతి భవన్ పేరిట గడీ నిర్మించుకొని, భారీ కంచెలు ఏర్పాటు చేసుకొని వందలాది మంది పోలీసు పహారా పెట్టుకొని తెలంగాణ ప్రజలను అందులోకి రాకుండా నిషేధించారని, తాము అధికారంలో వచ్చాక ప్రగతి భవన్ పేరును ప్రజా భవన్‌గా మార్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గడీగా మారిన ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఇప్పుడు ఎవరైనా ప్రజా భవన్ లో స్వేచ్ఛగా వెళ్లవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

కోటి రూపాయిలు ఖర్చు చేయలేదు

తెలంగాణ పరిపాలనకు సచివాలయం గుండెకాయ అని సీఎం అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరడంతోపాటు తెలంగాణ అభివృద్ధికి సచివాలయం నుంచే విధాన పరమైన నిర్ణయాలు జరుగుతాయన్నారు. మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గత పాలకులు ఎవరూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధకరమన్నారు. దాదాపు ఇరవై రెండున్నర లక్షల కోట్లను అప్పటి ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, తెలంగాణ విగ్రహ ఏర్పాటుకు రూ.కోటి ఖర్చు కూడా చేయలేకపోయిందన్నారు..

60ఏళ్ల కలను నేరవేర్చింది సోనియానే..

సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది లేదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారని రేవంత్ అన్నారు. కరీంనగర్‌లో ఇచ్చిన మాట మేరకు సోనియా గాంధీ 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. 2014లో తెలంగాణ ఏర్పాటు కావడం సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమన్నారు.

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2009, డిసెంబరు 9న మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని, అదే రోజు తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినం కావడంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజలకు డిసెంబర్ 9 ఒక పండగ రోజు అని ముఖ్యమంత్రి అన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది అరుదైన అవకాశం.. ఇటువంటి అరుదైన అవకాశం అందరికీ రాదని, ఈ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం తనకు దక్కిందని ముఖ్యమంత్రి అన్నారు.

కాగా, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరుకాలేకపోయారన్నారు. ప్రస్తుతం విక్రమార్క కేరళలో పర్యటనలో ఉన్నారన్నారు. అలాగే కొంతమంది మంత్రులు కూడా ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహం లేక పోవడం లోటుగా భావించమని, మేధావుల సూచనల మేరకు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడానికి నిర్ణయించుకున్నామన్నారు. కొంతమంది తమ కోసం సెక్రటేరియట్ ముందు స్థలం ఏర్పాటు పెట్టుకున్నారని విమర్శించారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేకే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

కానిస్టేబుల్‌ను పరామర్శించిన గవర్నర్..

ములుగు, ఆగష్టు 28 :పాము కాటుకు గురై ములుగు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీస్ కానిస్టేబుల్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పరామర్శించారు. గవర్నర్ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ షబరిష్ లతో కలిసి పరామర్శించారు. బుధవారం ఉదయం లక్నవరం అడవిలో కానిస్టేబుల్ ను పాము కరవడంతో వెంటనే ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తెలుగు భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ కాశీ విశేశ్వరరావు.

హైదరాబాద్, ఆగష్టు 28 :వ్యవహార భాష అందాన్ని ఆ భాషను వాడే విధానాన్ని తెలిపిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వ్యవహారిక భాషోద్యమ సారథి గిడుగు రామ్మూర్తి పంతులు యాదిలో కార్యక్రమం గానసభలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు భాష వైతాళి వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చారన్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంథిక వాదులతో అలుపెరుగని పోరాటం చేశారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్ని, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన భయానకం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, ఆగష్టు 28 :కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారి స్పందించారు. ఆ ఘటన నిరాశను, భయాన్ని కలిగించినట్లు ఆమె చెప్పారు. ఇక జరిగింది చాలు అని ఆమె అన్నారు. పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ద్రౌపది ముర్ము ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థులు, డాక్టర్లు, పౌరులు.. కోల్‌కతా ఘటన పట్ల నిరసన చేపడుతుంటే, మరో వైపు నేరస్థుల మాత్రం స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు ఆమె ఆరోపించారు.

అకృత్యాలకు ఏ నాగరిక సమాజం కూడా తమ కూతుళ్లు, సోదరీమణులను బలి ఇవ్వదని ఆమె పేర్కొన్నారు. సమాజం తనను తాను ఆత్మపరిశీలన చేసుకోవాలని, కొన్ని కఠినమైన ప్రశ్నలు వేసుకోవాలన్నారు. నిర్భయ ఘటన జరిగిన 12 ఏళ్ల కాలంలో.. సమాజం ఎన్నో అత్యాచార ఘటనలను మరిచిపోయిందని, ఇటువంటి సామూహిక మతిమరుపు అసహ్యకరమైదన్నారు. గత తప్పులను ఎదుర్కొనేందుకు సమాజం భయపడుతోందని, కానీ ఇప్పుడు చరిత్రను సమూలంగా మార్చేందుకు సమయం ఆసన్నమైందన్నారు. సమగ్రమైన రీతిలో ఈ సమస్యను నిర్మూలించేందుకు ప్రయత్నిద్దామని ఆమె పేర్కొన్నారు.

లారీ - కారు ఢీ - ఇద్దరి దుర్మరణం

నిజామాబాద్, ఆగష్టు 28 :నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు రోజులుగా రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఓ లారీని బుధవారం తెల్లవారుజామున వేగంగా దూసుకొచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో కారులోని ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం చిట్లీ గ్రామానికి చెందిన వంశీ (19), నిజామాబాద్ కుమార్ దల్లి ప్రాంతానికి చెందిన రాజేష్ (20) అనే ఇద్దరు యువకులు.. తమ స్నేహితుడైన రాజేష్ అనే మరో యువకుడితో కలిసి కారులో వెళుండగా ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీనగర్ వద్ద గల ఓ రైస్ మిల్ దగ్గర ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాదంలో వంశీ, రాజేష్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రాజేష్ అనే మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

ఆదివారం సికింద్రాబాద్‌లోని శివానంద ఆశ్రమంలో "జాతీయ సాహిత్య పరిషత్" తెలంగాణ ప్రాంత సమావేశంలో జరిగిన కవి సమ్మేళనంలో కవిత్వం వినిపిస్తున్న డా॥ సబ్బని లక్ష్మీనారాయణ.

పభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రవీంద్ర భారతిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

నామమాత్రపు ఫీజులతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఖీూఓం వనితీరు అభినందనీయమన్నారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన యాజమాన్యాలు అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో సైతం ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. చదువుతో పాటు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కాగా, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

నేటి కందం– నేటికి అందం

తలరాతలనే మార్చగ
నిలలో నుత్సుకత నిలిపి ఈప్సితము నిడన్
అలుపెరుగక జరుపవలయు
కిలకిలమని నవ్వుకొనుచు క్రీడల దినమున్

(22-8-1639 మద్రాసు దినం)

–రాధశ్రీ
సెల్:9494481210

చురక

నేరమున్నా లేకున్నా
నేతలకు జైళ్లు బెయిళ్లు
సామాన్యమే ఎందుకింకా
స్వాగతాల గొప్ప స్థయిళ్లు
నేరాలకు శిక్షెప్పుడో
నిర్ధారణ ఏళ్లకేళ్లు
అంతవరకు రాజకీయ
అడ్డులేని పారే కుళ్లు

–వేల్పుల నారాయణ
9440433475

ఆహ్వానం
లాల్ నీల్
స్ఫూర్తి ప్రదాతలు
పుస్తక ఆవిష్కరణ

సభాధ్యక్షులు
భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు

పుస్తక ఆవిష్కర్తలు
బి.వి రాఘవులు గారు
సిపివి(ఎం) పోలిట్ బ్యూరో మెంబర్
కాకి మాధవ రావు గారు
మాజీ చీఫ్ సెక్రటరీ (ఉమ్మడి రాష్ట్రం)
చంద్రకుమార్ గారు
మాజీ హైకోర్టు జస్టిస్

పుస్తక పరిచయం
ఎస్. వినయ కుమార్
కార్యదర్శి ఎస్‌వికె

స్వాగతం
తంగిరాల చక్రవర్తి

రచయిత స్పందన
జి. రాములు
పుస్తక రచయిత

సమీక్షలు
ప్రొ. నందమాస స్వామి గారు
డా. పసునూరి రవీంద్ర గారు
డి. జిలకర శ్రీనివాస్ గారు
కె. ఆనందాచారి

తేది: 4.09.2024
సాయంత్రం 3గం॥లకు
దొడ్డి కొమరయ్య హాల్

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె)

సాహిత్యం సంగీతం
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆహ్వానం
ప్రముఖ రచయిత
శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు
రచించిన
ఆత్మీయ రూప, ఆనంద ప్రద
శ్రీ శ్రీనివాస శరణు మంజరి
మరియు
ఆప్తరూప, అభయ వరద
ఏడుకొండల శ్రీ వేంకటేశ్వర శరణుమంజరి
గ్రంథాల ఆవిష్కరణోత్సవం

తేది : 08-09-2024 ఆదివారం ఉ॥ 10-30 గం॥లకు
వేదిక : డా॥ కె.వి.రమణాచారి గారి క్యాంప్ కార్యాలయం,
హఫీజ్ మంజిల్, మహావీర్ హస్పటల్ ఎదురుగా, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్.

ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి.రమణాచారి గారు, ఐ.ఎ.ఎస్. (ఐ.)
తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు
సభాధ్యక్షులు : డా॥ పి. లలితవాణి గారు, ప్రముఖ విద్యావేత్త
విశిష్ట అతిథి : శ్రీ బైస దేవదాస్ గారు, "నేటి నిజం". పత్రిక సంపాదకులు
గౌరవ అతిథి : శ్రీ రుదిబండి వెంకటరెడ్డి గారు,
అధ్యక్షులు, జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, హైదరాబాదు

రఘుశ్రీ
వ్యవస్థాపక కార్యదర్శి,
శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్, హైదరాబాదు
చరవాణి : 9247108893

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 29-8-2024

ఆదివారం సికింద్రాబాద్‌లోని శివానంద ఆశ్రమంలో "జాతీయ సాహిత్య పరిషత్" తెలంగాణ ప్రాంత సమావేశంలో మణికొండ కాంతారావు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు.

వృద్ధాప్యం!

వడ బోసిన జీవితంలో
గీత దాటే
చివరి విధి మలుపు,
జీవితము క్షణభంగురమే
కాదన లేము,
అంతా ఆవిరి అయి
పోయినట్లుగా?
పులిసిన పాలు
గడ్డ కట్టినట్లుగా?.
ముగియనున్న అధ్యాయం,
కాలం చేతిలో వేర్లు కోల్పోయి
నేల మీద పడ బోతున్న
అనుభవాల మహావృక్షం!
పులి పిల్లిలా మారి పోతుంది,
మళ్లీ మొదటికే అన్నట్లుగా
తొంగి చూసే
వింత చేష్టల వికృత బాల్యం,
మైవిరుపులు,మై మరపులు!
నెత్తి మీదే పిడుగులు
పడుతున్నప్పటికినీ
వినిపించని శబ్దాలు,
కానరాని దృశ్యాలు,
అంధకారంలోకి
నెట్టి వేయబడ్డ



జ్ఞాన నేత్రాలు,
వంగిన నడుము,
కదలని కాళ్లు,
మెలికలు తిరిగిన నాలిక,
తడబడే మాటలు,
తడియారని తపన,
మనస్సు కుక్క తోకలా
ఊగిస లాడుతుంది
చేసేది ఏమి లేక?.
తనముందే పరుగిడుతున్న
కాల చక్రాన్ని గతంలో లాగా
ఒడిసి పట్టుకోలేని వైనం,
ఇవన్నీ పగలు

రాత్రి తెలియకుండానే
సాగి పోతుంటాయి,
క్యాలెండర్ లో
తెలియని తేదీలు,
గుర్తుకురాని దినవారాలు,
నెలల పుటలు మారుతూ
చినిగిపోతుంటాయి,
కాలం కన్నెర్ర చేసే
ముగింపు అధ్యాయపు
సమయం వచ్చినట్లుగా.....
రోగాల కంపలో పడి
ఆసుపత్రుల చుట్టూ
అవలక్షణ ప్రదక్షిణాలు,
మబ్బులు కమ్మిన
శూన్యాకాశంలో
ప్రకాశించని నక్షత్రాలు!
రామచిలుకలు గుడ్లగూబలై
అపశకనాలను వల్లిస్తుంటాయి,
చిలికి చిలికి జడి వానైనట్టుగా
బంధాలు,అనుబంధాల్లో
కనిపిస్తున్న ఆత్మీయ ప్రకంపనలు,
అల్లకల్లోలాల పదనిసలు!
ఆస్తుల కోసం వారసుల
పంపకాల తతంగాలు,
ఊహాకందని విపరిణామాలు,
పట్టు చేజారి పోతున్నట్లుగా?
బతుకు అతుకుల మయమై,
తప్పని ఎడారిలో దిక్కులేని
ఒంటరి ప్రయాణంలో..,
సాయం చేయని
చేతలే ఎక్కువ,
నిర్వీర్యతల మధ్య
ఎద రోదనమై పోతుంది,
పండుటాకులు,
ఎండు టాకులై
నేల మీద తీరం చేరని
అలల్ల పడి
రాలిపోతుంటాయి!
చెప్పాలంటే జీవితం
అంతుచిక్కని సముద్రమే,
దరి చిక్కని అగాధమే,
కన్న కలలు సన్నగిల్లి
పోతుంటాయి!
కన్నవాళ్ళు చీదరిస్తూ
కళ్ళు పొడుచుకుంటూరు!
జ్ఞాపకాల తేనె తుట్టలకు
చిల్లులు పడుతుంటాయి,
చెల్లని నాణెంలా
కాలం చెల్లి పోతుంది,
సాలెగూడు ఆకారం లా
దేహం రూపు రేఖలు
మారిపోతుంటాయి!
చెదలు పట్టినట్లుగా
ఇంటి ఆవరణం మారుతుంది,
అక్కరకు రాని
ప్లాస్టిక్ పువ్వుల ప్రేమలు
విరబోసిట్లుగా,
మనసు ప్రశాంతతను
కోరుతుంది, మృత్యోర్మా
అమృతంగ మయంగా
మారి పోతుంది!
మండని భాస్వరమై
ఆగిపోతుంది!

-సంకేపల్లి
నాగేంద్రశర్మ,
8074826371

రాజకీయాలు

సంపాదనా పరులకు
నెలవు
సంస్కరణ వాదులకు
కరువు !

కపట ప్రేమ

మహిళంటే
మహారాణులంటూ
మోకరిల్లుతారు
మహిళాబిల్లంటే మాత్రం
మోకాలడ్డు పెడతారు !

హోమీలు

లాభ నష్టాలు
తేలికైనవి
తేరగా వచ్చినవి కదా
చిన్న గాలికే
ఎగిరిపోయాయందుకే !

- వి. భసవేశ్వర రావు
సెల్:9490832787

మసన చెన్నప్ప చూపు.. "దేశం వైపు"

ప్రముఖ ఆర్షకవి, ఉపనిషత్తుల వ్యాఖ్యాత ఆచార్య మసన చెన్నప్ప దేశంవైపు దృష్టి సారిస్తూ 60 కవితలతో తన రెండవ వచన కవితా సంపుటిని వెలువరించారు. ఈ సంపుటిలోని సింహభాగం కవితలు 'నేటినిజం'లో ప్రచురితమైనవే- కావటం గమనార్హం. వర్ధిష్ణువులైన కవులతో బాటు ప్రసిద్ధులు కూడా 'సాహితీ కెరటాలు' వేదికను సుసంపన్నం చేస్తున్నారు. యిదివరలో వెలువడిన 'శ్రేష్ఠారామం' ఆర్షధర్మాన్ని ప్రతిబింబిస్తే.. ఈ సంపుటి దేశభక్తికి ఆలవాలంగా నిలుస్తుంది. నాలుగు దశాబ్దాల అధ్యాపకత్వం నెరపిన చెన్నప్ప యిప్పటి వరకు 52 గ్రంథాల సృష్టికర్త. వీటిలో దైవికమైనవి, జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, శతక రచనలు, నాటికలు, వ్యక్తిత్వ వికాస పొత్తాలు, పరిశోధనలు, ఉపనిషత్తుల పరిష్కారాలు, కథా గేయాలు.. యిలా పలు ప్రక్రియల్లో వైవిధ్యభరిత సృజనలు. ధర్మో రక్షితి రక్షితః' అన్న సూక్తిని విన్నా. 'వృక్షో రక్షతి రక్షితః' అనే నానుడి కూడా బహుళ ప్రాచుర్యం పొందింది. కాని మసన వారు

'దేశో రక్షతి రక్షితః' అని పిలుపునిస్తు తన దేశభక్తిని చాటుకుంటున్నారు.

"ఉత్సాహముతో నుండగ
ఉపనిషత్తులిచ్చావు
దర్మమెరిగి నిలువగలుగు
ధర్శనములిచ్చావు
ఓ జననీ నా దేశమా!
నా వేద సందేశమా!" అంటు పరవశిస్తారు కవి చెన్నప్ప.



ప్రతులకు:
శ్రేష్ఠారామం, 9-76/2
ఉదయ్‌నగర్ కాలనీ
బోడుప్పల్, హైదరాబాద్-500 092
సెల్: 98856 54381

"కలాం! నీకిదే సలాం", "కార్గిల్ యుద్ధ విజేత అటల్ బిహారీ వాజ్‌పేయీ" నీవే మాకాదర్శం" అంటు దేశభక్తులకు అక్షరనీరాజనం సమర్పిస్తారు.

"చక్షుషః చక్షుః".. "శ్రోతస్య శ్రోత్రం".. "వాచో హ వాచం".. "మనసో మనః" "ప్రాణస్యప్రాణః" అని దైవాన్ని స్తుతిస్తూ జగత్తులోని అంధకారాన్ని పటాపంచలు చేయమని ప్రార్థిస్తారు పండిత కవి మాసన.

మనిషికి నిజమైన శత్రువు ఎవరు? ఎవరు అని కదా మీ సందేహం?

"అతణ్ణి దెబ్బతీసే శత్రువు
అతనిలోనే వున్నాడు
అతడెవరని కదా నీ ప్రశ్న
అహంకారమే అతని శత్రువు"
అదీ సంగతి!!

అహంకారపు పొరలు ఛేదించుకో గలిగితే, మనిషికి వేరే శత్రువంటు వుండదని కవి భావం.

ప్రతి కవికీ కవిత్వమంటే తనకేమి టోనన్న స్పష్టత అవసరం. మసన ఏమంటున్నారో గమనించండి.

''కవిత్వమంటే ఎదారిలో ఒయాసిస్సు!
మనిషిని ప్రేమించేది నా కవిత
మనుషుల నైక్యపరిచేది నా కవిత
హృదయం లేకుండా కవితా రసాస్వాదనమా?

అంటు తన కవితా మర్మాన్ని విశదపరుస్తారు.

"ఒకరు దినరాజు
ఒకరు నిశారాజు
బొట్టు పెట్టినట్లు ఎవరు మిమ్మల్ని
ఆకాశానికతికించారు?"

వ్యాఖ్యానం అక్కరలేని చక్కటి భావుకత. కవి ఏం చేస్తాడు? సమాజాభ్యుదయం కాంక్షిస్తాడు. ప్రగతి పథంలో ఎదురైన ముళ్ళను ఏరేస్తాడు.పూలను పంచుతాడు. సమాజం పరిధవిల్లితే దేశం పురోగమించినట్లే.. అందుకే ఈ చూపు.

"చదువుకోని వాడు సమాజానికి భారం
పని చేయని వాడు భార్యామణికి భారం
పెరిగిన ఆశలు మనిషికి భారం
తరిగిన ఉత్సాహం మనస్సుకు భారం
ఉచిత పథకాలు దేశానికి భారం
లోభితనం దాతృత్వానికి భారం
సత్యమే.. చదువుల సారం"
యివన్నీ నీతిసూక్తులుగా అగుపించినా.. ప్రబోధాత్మక జీవిత సత్యాలు..

మసన చెన్నప్ప ప్రకృతి ప్రేమికుడు.. ప్రకృతి ఆరాధకుడు. ప్రకృతి పరిశోధకుడు. ఈ పంక్తులను గమనించండి.

"ఎందరెందరో ఇన్నాళ్ళుగా
ఎంత పరిశోధన గావించినా
అంతుబట్టని మహిమ నీది
అమ్మా ప్రకృతీ!
నీ కడుపులోకి
మహా ప్రళయాలెక్కడినుంచి వచ్చాయో
తెలుసుకోవాలని వుంది" అని వాపోతారు.

'తలమీద కిరీటం పెట్టిన వాణ్ణి మాత్రమే గుర్తుంచుకుంటే చాలదు

కాళ్ళకు చెప్పులు కుట్టిన వాణ్ణీ పట్టించుకోవాలి" కవిది శ్రమజీవుల పక్షమని చెప్పకనే చెప్పున్నారు చెన్నప్ప.

"మనిషి ఉండీ ఎందుకని?" అంటు ఓ గజల్‌ను గానం చేస్తారు మసన వారు.

మనిషికోసం ప్రేమ చూపని
మనిషి ఉండీ ఎందుకని?
నేలకోసం చినుకు రాల్చని
జలదముండీ ఎందుకని?
విత్తుకోసం జన్మ ఈయని
వృక్షముండీ ఎందుకని?
ప్రగతికోసం చెమటరాల్చని
బ్రతుకు వుండీ ఎందుకని?
పరుల కోసం జ్ఞానమీయని
విబుధుడుండీ ఎందుకనీ
మసన తోడు మాటలాడని
మనిషి ఉండీ ఎందుకని?
మనిషి ఉండీ ఎందుకని?"

"గజలియత్" పండించిన గజల్‌లో ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలెన్నిం టినో సంధించారు కవి.

మరో రెండు మంచి గజల్స్‌నూ పొందు పరిచారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షుడిగా పదవీ విరమణ గావించిన మసన చెన్నప్ప జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 60 పరిశోధనా పత్రాలు సమర్పించారు.

ఆయన నేతృత్వంలో 8 మంది ఎంఫిల్ విద్యార్థులు, 24 మంది పిహెచ్‌డి విద్యార్థులు కృతార్థులయ్యారు.

చెన్నప్ప అందుకున్న అసం ఖ్యాక పురస్కారాలలో ఆం.ప్ర. ప్రభుత్వ ఉగాది కవితా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం వారిజాతీయ కవి పురస్కారం, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం నుండి ఆర్షకవి పురస్కారం మచ్చుకు కొన్ని.

మసన చెన్నప్ప వచన కవిత్వంలో కవిత్వంతో పాటు వచనం పాళ్ళెక్కువే. బహుశః అందరికీ అర్థం కావాలని, సామాన్యులకు కూడా చేరువ కావాలని సరళమైన భాషను ఎంచుకోవడం కారణం కావొచ్చు.

-రమణ వెలమకన్ని
సెల్:9866015040

కర్తవ్యం !

కొన్నికొన్ని కొత్తచెప్పులు
మన కాళ్ళను కొరికేస్తాయి.
కొన్నికొన్ని బంధాలు మన
నమ్మకాలను సరికేస్తాయి.
ఆఖరికి మానని గాయంచేసి
జ్ఞాపకాలను మనసుకతికించి
ఏమెరుగనట్లు మాయమైతాయి!
అందుకే ?
ఆచెప్పుల్ని చెత్తలో విసిరేసినట్లు
ఆ బంధాల్ని మదిలో తుడిపేసి
ఆ ఆలోచనల్ని ఎదలో చెరిపేసి
ఆ జ్ఞాపకాల్ని చెదలని దులిపేసి
బాధ్యతనే భవిష్యత్తని తలచుకొని
పట్టుదలనే ప్రాణంగా మలచుకొని
మనోధైర్యాన్నే దైవంగా నమ్ముకొని
చేసేపనికి ప్రకృతినే కనికరించమని
కాలాన్ని అనుసరించడమే కర్తవ్యం !

- డా॥ డి.రాజేశ్
9440460490

పుస్తక సమీక్షలు

తల్లిదండ్రులు పిల్లల బాగు కోరుతారు అనడంలో ఎటువంటి సందేహము లేదు. సందూరు రామచంద్రా రావు కథలో ఒక తండ్రి కొడుకు వ్యాపార వృద్ధి కావడానికి పడ్డ శ్రమ, ఆ తండ్రి చనిపో యినప్పుడు తెలిసి బాధపడే కొడుకుని చూస్తాం.

డాక్టర్ వివేకానంద మూర్తి గూడు విడిచిన గుండె కథలో పక్షుల పట్ల తన ప్రేమనుప్రకటిస్తారు. తన ఇంటి కన్నంలో మైనా గూడు కట్టుకోవడం, ఆ కన్నాన్ని పూడ్చాలి అనుకున్న తను, మైనాల కోసం పూడ్చకుండా పదిలే యడంలో మానవత్వాన్ని చాటుతారు.

అమూర్తం

ఒక రోజంతా ఏకాంతంలో
తెగిన గాలిపటమై విహరించు.
పచ్చని చెట్లలో పురుగువై
పక్షుల గుంపులో పరుగువై
నది ఒడ్డున ఇసుక రేణువై
ఊరవతల గుట్టమీద
గ్రావిటీని గెలిచి నిలబడ్డ రాయివై
ఏమి ఆశించని తపస్సు చెయ్.
గమ్యం లేని అడుగులేస్తూ
ఎక్కడికో సాగిపో
చెరువులో ఒక్కడివే
శవాసనం వేసి నీళ్ల మీద తేలిపో..
అనంతాకాశాన్ని
సజల నేత్రాలతో పరికించి చూడు
కరుణామయ గంధాన్ని
పులుముకున్న గాలి
సుతారంగా నిన్ను అల్లుకుంటుంది
ఆ ప్రేమైక స్పర్శకు
అమూర్త భావనామృతపు జల
ఊరడం గమనించు

-మౌనశ్రీ మల్లిక్
8919338546

విభిన్న దృశ్యాలు

తెలుగు సాహితీ వనం ఆధ్వర్యం లో రూపొందించబడ్డ ఈ అంతర్వా హిని 25 కథల సమాహారం. సంపాదకులు శ్రీమతి శాంతికృష్ణ.

కథలు జీవితాన్ని ప్రతిబింబి స్తాయి. కుటుంబంలోనూ సమాజం లోనూ జరుగుతున్న విషయాలను, మనసుకు పట్టించు కోని మానవత్వాన్ని ఆధారముగా చేసుకుని, జీవిత గమనానికి ఏ మార్గం అయితే ప్రశంసించ బడుతుందో ఆ మార్గాన్ని కథల రూపంలో మన ముందు ఉంచుతారు రచయితలు. ఈ సంకలనంలో కూడా రచయితలు అదే ప్రయత్నం చేశారు.

అదే కథలో నవీన్ చంద్ర ఆడ మగ వివక్షతను పాటిస్తున్న సమాజం, కడుపులో ఉండగానే పుట్టేది ఆడపిల్ల అయితే తీయించేసుకుంటున్న సమాజాన్ని సుతిమెత్తగా విమర్శించారు. ఆడపిల్లల ఆవశ్యకతను మన ముందుంచే ప్రయత్నం చేశారు.

పెద్దవారైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చటం ఇప్పుడు సర్వసాధారణం అయినది. ఇది ఎంతో హేయమైన పని. అయినా కూడా ఇప్పుడు జరుగుతున్నది ఇదే. తల్లిదండ్రులు చేసిన సేవలు మరచిన ఫలితం ఇది. వారణాసి భానుమూర్తి తన రచనలో అలా నిర్లక్ష్యం చేసిన కుమారులను తల్లి ఎలా తగిన బుద్ధి చెబుతుంది అనే విషయాన్ని వ్యక్తపరిచారు.

నిర్లక్ష్యమో తాగుబోతుల వలనో అతివేగం వలనో ఇలా కారణాలు ఏమైనా ఈ మధ్యకాలంలో రోడ్లు రక్తసిక్తం అవటం బాధ కలిగించే విషయం. ఆ సమయంలో కొద్దిపాటి అలసత్వం కూడా ప్రాణం పోవడానికి కారణం అవుతుంది.డా.రామశర్మ ఒక మంచి ఉపయోగకరమైన పరిష్కార మార్గాన్ని ఈ కథలో సూచించడం చాలా బాగుంది. నిజమైన ఆపద్బాంధవు లు వారే.

తనకు కూడు పెట్టిన లచ్చిందేవి అనే పేరు పెట్టుకున్న బర్రెను అమ్మటానికి మనసు రాలేదు బుచ్చపతికి. కొత్త బర్రెకుంటేనే బ్యాంకు లోను అని అందరూ చెప్పినా కూడా లచ్చిందేవిని అమ్మకుండా... ఉపాయంతో లోను సంపాదించిన బుచ్చపతి, తను పెంచుకున్న జంతు ప్రేమను "ఇకమాతు" కథలో మన కళ్ళ ముందుంచారు పెద్దింటి అశోక్.

సత్యాజీ తన "ఇచ్చింగ్" కథలో కుల పిచ్చి ప్రసక్తిని తీసుకువచ్చారు. ఈ ఆధునిక కాలంలో ఇలాంటివి తగ్గాల్సి ఉండగా పెరగటం వింతగానే ఉంటుంది. మనుషులంతా ఒక్కటే అన్న భావన పెరిగి, ఈ కుల మత పిచ్చి పోయే సమాజం కోసం ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కవులు రచయితలు సామాజిక రుగ్మతలపై తమ నిరసన గళాలను వ్యక్తపరుస్తూనే ఉంటారు. మతమౌడ్యాన్ని పరిహసిస్తూ రాసిన సలీం గారి రచన "ఎవరికి తెలుసు"కథ ఆకట్టుకుంది.

కంటేనే అమ్మ గుణమా, పెంచడంలో కూడా అమృతనం ఉంది అని "వసుంధర" కథలోశాంతకృష్ణ చెబుతారు. ఈ కథ గుండెతడిని తట్టి లేపుతుంది.

సుధా కళ్యాణి టీనేజ్ పిల్లలు తమ తల్లిదండ్రుల సుద్దులను విసుగుగా భావించి,ఎలా కష్టాలు కొని తెచ్చుకుంటారో తన కథలో తెలియజేశారు.

ప్రతులకు:
శాంతి కృష్ణ,
8309686404

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తెలిపే చక్కని కథ రాశారు రామలక్ష్మి తన గుండె చప్పుళ్ళు అనే కథలో. లేనివారని నిర్లక్ష్యం చేసిన చెల్లెలు, తన అన్న ప్రేమను తెలుసుకొని మారిన తీరును చక్కగా చిత్రీకరించారు.

పత్రం పుష్పం కథలో శ్రీధర్ రెడ్డి చదువుకునే పిల్లవాడు శ్రీను ఆలోచన రూపంలో మూఢ నమ్మకాలపై తన వ్యతిరేకతను కథ రూపంలో మన ముందు ఉంచారు.

తమ్ముళ్లను చెల్లెళ్లను వృద్ధి లోకి తీసుకురావడంలో తన జీవితాన్ని పణంగా పెట్టిన బాధ్యత గల అక్కకు, తమ్ముళ్ళు చెల్లెళ్ళు బాధ్యతగా వివాహాన్ని జరిపించిన కథను పద్మావతి విష్ణువజ్జుల చక్కగా రచించారు.

తండ్రి కూతుర్ల ప్రేమానుబంధాలను చిత్రీకరించారు బెల్లం కొండ మహేష్ తన "ప్రేమ కానుక" కథలో...ఒకరి పుట్టినరోజుకి ఒకరు కానుకల కోసం శ్రమించిన విధానం బాగుంది.

బామ్మ బహుమతి ఖరీదు కోట్ల రూపాయలు అని తెలిసి మనవరాలు పొందే ఆశ్చర్యం ఆనందం గురించి ఈ కథ చెబుతుంది.

సుబ్రహ్మణ్యం బామ్మ గారి స్వగతం, మనవరాలు స్వగతం ద్వారా కథ నడిపారు.

డా.పాతూరి అన్నపూర్ణ మట్టిబంధం కథ మారిన జీవన విధానం గురించి చెబుతుంది. ఉద్యోగం పేరిట పల్లె నొదిలి సంతానం దేశాలు విడపటం తల్లిదండ్రులను ముసలితనంలో ఒంటరిని చేయడం చూస్తున్నాం .

అయితే ఈ కథలో చిన్న కుమారుడు తిరిగి పల్లెకి పోయి వ్యవసాయం చేయడమనే నిర్ణయం తీసుకోవడం హైలైట్ గా చెప్పబడుతుంది.

డా.విజయలక్ష్మి పండిట్ కృత్రిమ మేధ పై తన కథ " మనుషులు మేషిన్లు" లో ఆసక్తి కరమైన కథనాన్ని వినిపిం చారు. మేషిన్స్ కెనాట్ రిప్లేస్ద్ హ్యూమన్ బీయింగ్స్ అనే వాక్యాన్ని వాడి కృత్రిమ మేధ ఆధారిత దుర్వినియోగాన్ని అరికట్టాలని సందేశం బాగుంది.

ఇంట్లో అవ్వ తాతల నుండి చంటి పిల్లలు అనేక విషయాలు నేర్చుకుంటారు.

చదువుకుంటున్నామన్న ధ్యాస లేకుండా విషయాలను తెలుసుకోవడమే విద్య. మబ్బులు వీడిన ఆకాశం కథలో అరుణ సందడి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. చిన్ని వాళ్ళ నాన్నమ్మ దగ్గర అనేక విషయాలు నేర్చుకుని బహుమతి గెలుచుకున్న కథనం బాగుంది

అమ్మ కానీ అమ్మ పై కూతురు ప్రేమను కూతురు గాని కూతురుపై తల్లి ప్రేమను మనకు పరిచయం చేయ దానికి ప్రయత్నించారు సుమన ప్రణవ్ తన కథలో...

ప్రభాకర మూర్తి తన "లేడి పిల్లలా" కథలు నరసమ్మ అనే ముసలావిడ హుషారు గురించి హాస్యాస్పదంగా రాశారు. సరదాగా నవ్వుకోవచ్చు.

మారిన మనిషి ఒకరు తండాకు పోయి అక్కడ వారిని నాగరికత లోకంలోకి మార్చే ప్రయత్నంలో చివరన చిక్కుల్లో పడటం మన్నెం శారద "వేట" కథలో చూస్తాం.

లక్ష్మి రాయవరపు వేళకాని వేళ త్వరపడి కథలో భర్త , కూతురు ఇచ్చిన సర్ప్రైజ్ లతో చదువరులకు సర్ప్రైజ్ లు ఇచ్చారు.

ఏదో ఒక వ్యాపకం లేకపోతే మనిషి ఎలా బద్దకస్తుల వుతారో తన కథలో తెలియజేశారు బిందు మాధవి. ఈ కథలో చలపతి గారిని తిరిగి వ్యాపకం లోకి దించడం బాగుంది.

రోహిణి వంజరి గారు తన సైన్స్ రికార్డు కథను శాంతం నెల్లూరు మాండలికంలో రాశారు. గురువారం సాయిబాబా గుడిలో నిర్వహించే కార్యక్రమాల వర్ణన బాగుంది. కళ్ళతోపాటు ఒళ్లంతా ఎరుపు చేసుకొని పడ మర దిక్కున వాలిపోయాడు సూర్యుడు నిద్రపోవడానికి.... అన్న వర్ణన బాగుంది. స్టీలు చెంబు, సైన్స్ రికార్డు ఎలా చేతులు మారుతాయో తమాషాగా రాశారు రచయిత్రి.

డా.ఏనుగు నరసింహారెడ్డి రచించిన స్టేట్మెంట్ కథలో సంసారంలో జరిగే చిన్న చిన్న విషయాలను పెద్దవిగా భావించి ఆత్మహత్య ప్రయత్నం చేసిన వినీత తిరిగి తన తప్పుని తెలుసుకున్న విధానం బాగుందిజీవన గమనంలో అనేక సంఘటనలు ప్రస్తావిస్తూ సాగిన ఈ అంతర్వాహిని కథల సంకలనం బాగుంది. రచనా శైలి విభిన్న రకాలుగా మనకు పరిచయం అవుతుంది. చదవాల్సిన పుస్తకం ఇది. సంపా దకులు శాంత కృష్ణ గారికి, తదితర బృందానికి అభినందనలు.

-అవ్వారు శ్రీధర్ బాబు,
8500130770,

గిద్దెగళం ఆధ్వర్యంలో గద్దర్ అవార్డులు

తొర్రూరు గడ్డమీద గిద్దెగళం జాతరంట
ఉర్రూతలూగించే గద్దరన్న పాటలంట
జిల్లాలకు జిల్లాలే భళ్ళున బైలెల్లునంట
గద్దరన్న జ్ఞాపకాలు యాదిజేస్తు పాడునంట
కదలుదామురో గిద్దెగళం సభకు సిద్ధమయ్యి
కవాతు చేద్దామురో కళాగళం యుద్ధమయ్యి
(పాట రచన: తాళ్ల సునీల్)

ప్రముఖ వాగ్గేయకారుడు, ప్రజా యుద్ధనౌక, గద్దర్ ఆశయాలను కొనసాగించుట కొరకు వారి శిష్య ప్రశిష్యులు గత ఏడాదికాలంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరంపరలో భాగంగా ప్రముఖ జానపద గాయకుడు, రచయిత గిద్దె రాంనర్సయ్య తొర్రూరులో ఈ నెల 30న పెద్ద ఎత్తున "గద్దర్ యాది సభ" నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇదే వేదికపై తెలంగాణకు చెందిన సుమారు 150 మంది ప్రముఖ కవులు, కళాకారులు, గాయకులకు "గద్దర్ అవార్డు" ఇవ్వనున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరుకు చెందిన గిద్దె రాంనరసయ్య ప్రసిద్ధ వాగ్గేయకారుడు. గత మూడు దశాబ్దాలుగా దళిత పోరాటాలలో, సామాజిక ఉద్యమాలలో, తెలంగాణ ధూంధాంలలో పాల్గొని తన ఆటపాట మాటలతో జనాన్ని చైతన్యం చేశారు. గద్దర్ శిష్యుడిగా వారితో ఎన్నో వేదికలను పంచుకున్నారు. ఆ ప్రభావంతోనే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే, తన కలంతో, గళంతో ఎన్నో చైతన్య గీతాలను అందిస్తున్నారు. గద్దర్ వారసత్వాన్ని అందిపుచ్చుకొని, పాటను తన భుజాలపై బాధ్యతగా మోస్తూ ముందుకు సాగుతున్నారు.

రాంనర్సయ్య ఆలోచనలకు శ్రీకారం

ప్రసిద్ధ జానపద వాగ్గేయకారునిగా పేరుగాంచిన గద్దర్ మరణించడంతో, వారి మీదున్న అపారమైన గౌరవంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ తారలకు ఇచ్చే నంది అవార్డులను గద్దర్ పేరుతో గద్దర్ అవార్డులు అని ఇస్తామని ప్రకటించడం హర్షనీయం. ఇలా ప్రభుత్వం తరఫున తెలుగు సినీ, టీవీ చెందిన నటినటీలకు, సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. అం దుకే రాంనర్సయ్య మెదడు లో ఒక ఆలోచన తట్టింది. మరి కళనే నమ్ముకుని అత్యంత సాదాసీదాగా, ప్రచారార్భాటాలేవీ లేకుం డా జీవిస్తూన్న గ్రామీణ ప్రాంత జానపద కళాకా రులను ఎవరు గుర్తిస్తారు? వాళ్ళని ఎవరు సన్మానిస్తారు? ఎవరు అవార్డులు ఇస్తారు?? ఈ మధ్యకాలం లో కిన్నెర మొగిలయ్య, చిందు సమ్మయ్య, బలగం మొగిలయ్య లాంటి వారిని అవార్డు, రివార్డులతో ప్రభుత్వం సత్కరించింది. కానీ తెలంగాణలో ఉన్న వేలాదిమంది ప్రజా కళా కారులను ఇలా సన్మానం చేయాలంటే ఎన్ని సం వత్సరాలు పడుతుంది? ఈ ఆలోచనలతో రాంనర్సయ్య సతమతమయ్యారు. అందుకే ఇలాంటి గ్రామీణ ప్రాంత కవులు, కళాకారులు, గాయకులను తన సొంత సంస్థ ఆధ్వర్యంలో "గిద్దెగళం గద్దర్ అవార్డు" తో సన్మానిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాడు. కొందరు పెద్దల వద్ద ఈ విషయాన్ని చర్చించాడు. వాళ్ళు అందరూ చాలా బాగుంటుందని ఆమోదం తెలిపారు. దాని తో గిద్ద గళం గద్దర్ అవార్డు కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారు. అందుకే 2024 ఆగస్టులో గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నారు.

అలుపెరుగని శ్రమ

"గిద్దెగళం గద్దర్ అవార్డు" గురించి చాలా మంది సరేననడంతో రాంనర్సయ్యలో నూతన ఉత్సాహం పెల్లుబికింది. గురువుగారి ఋణం తీర్చుకునే సదవకాశం లభించిందని సంతోషిం చాడు. తాను ఇటీవల జాండీస్ వ్యాధి బారిన పడి మరణం చివరి అంచుదాక వెళ్లివచ్చాడు. ఒకరకంగా చెప్పాలంటే తను చచ్చి మళ్లీ బ్రతికాడు. అలాంటి స్థితిలో ఉండి కూడా తెలంగాణలోని నలుమూలల్లో ఉన్న కవులు కళాకారులను స్వయంగా కలిసి, తను చేస్తున్న కార్యక్రమానికి సహకరించాలని వివరించారు. దాదాపు రెండు నెలలుగా రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా కఠోరంగా శ్రమిస్తున్నారు.

హాజరుకానున్న మంత్రి, ఇతర ప్రముఖులు

ప్రసిద్ధ కళాకారుల రాకతో తొర్రూర్ పట్టణం 30 నాడు కళాసాగరం లాగా గోచరించనున్నది. తొర్రూరులో మునుపెన్నడూ జరగనంత అత్యద్భుతంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని రాంనరసయ్య శ్రమిస్తున్నారు. అతనికి తోడుగా ప్రముఖ గాయకుడు జూపాక శివ తదితరులు సహకరిస్తున్నారని తెలిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రసిద్ధిగాంచిన దాదాపు 150 మంది కళాకారులు పాల్గొననున్న ఈ కార్యక్రమానికి అతిథులు కూడా భారీగానే వస్తున్నారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఎంపీలు డా. కడియం కావ్య, ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, గద్దర్ కుమార్తె వెన్నెల, ప్రజా గాయకులు విమ లక్క, వరంగల్ శ్రీనివాస్, సంగంరెడ్డి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొం టారని రాంనర్సయ్య తెలిపారు.

-ముక్కెర సంపత్ కుమార్,9959618206

మగువ మనోవేదన

లక్షలు కట్నంగా పోసి
నిర్బంధంలో నివసించే
విడుదల లేని ఖైదీని నే

ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త, మార్గదర్శి బి.ఎస్. రాములు

75వ జన్మదిన అమృతోత్సవం విశేషాలు

23 ఆగష్టు 2024 శుక్రవారం ఉదయం 11:15 ని॥లకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త, మార్గదర్శి బి.ఎస్. రాములుగారి 75వ జన్మదిన అమృతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో ఆత్మీయుల సం దేశాలతో పాటు 25 ఏళ్లలో తెలంగాణ సాహి త్యం, కథ, నవల, సాహిత్య విమర్శ, సామాజిక ఉద్యమాలు, తత్వ శాస్త్రాలు అనే అంశాలపై సెమినార్లు జరిగాయి.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో...

రవీంద్ర భారతి సభాప్రాంగంలో 26 అడుగుల వెడల్పు పది అడుగుల ఎత్తుతో ఫ్లెక్సీ బ్యానర్ పై బి. ఎస్. రాములు గారు వెలువ రించిన 120 పుస్తకాల ముఖ చిత్రాలను కనులారా తిలకించే ఏర్పాటు అందరినీ ఆకట్టుకుంది. ఏమి రాసారు ఎన్ని రాసారు ఎన్ని రకాల సబ్జెక్టులపై రా సారో ఒకే 'చూపు'లో చూపరులకు తెలియజేసింది.

ఉత్సాహభరితంగా ప్రారంభమైన సదస్సు

సుప్రసిద్ధ రచయిత్రి జాజుల గౌరి, ఆహ్వాన సంఘం అధ్యక్షులైన సుప్రసిద్ధ సినీ దర్శకులు, కవి, చిత్రకారులైన 'మాభూమి' బీ. నర్సింగరావుగారిని తొలుత వేదికపైకి ఆహ్వానించారు. ప్రారంభ సమావేశంలో పలువురి ఆత్మీయుల సందేశాలు కొనసాగాయి. బి.ఎస్. రాములుగారితో పాటు సుప్రసిద్ధ రచయితలు, కవులు వేదికను అలంక రించారు.

అందరికి ఉచిత పుస్తకాల కానుక

ముందే వేసుకున్న ప్రణాళిక ప్రకారం వచ్చిన ప్రతి ఒక్కరికీ పదిహేను పుస్తకాలతో పుస్తకాల బ్యాగును ఉచితంగా అందించడం జరిగింది. ఆహూతలందరికి పుష్పగుచ్ఛాల స్థానంలో పుస్తక పుష్పాలు పంపిణీ చేసినట్లుగా సభికులు, హాజరైన సభ్యులు హర్షం వెలిబుచ్చారు.

అందులో ఇటీవల ప్రచురించిన పుస్తకాలతో పాటు ఆరోజు ఆవిష్కరించే పుస్తకాలు కూడా అందించారు. సభికులు, సాహితీవేత్తలు, అభిమానుల ఆనందానికి అంతు లేదు. విలువైన పుస్తకాలను 75వ జన్మదినం సందర్భంగా అందరికి అందజేయడం ఒక నూతన సంప్రదాయాన్ని సృష్టించినట్లయింది.

అలా పుస్తకాలు ఇవ్వడానికి ముందు ఆహ్వాన సంఘంలో చర్చ జరిగింది. ఏదో ఒక రేటుకైనా ఇవ్వాలి అని తొలుత ప్రతిపాదన వచ్చింది. మనమీద అభిమానంతో వస్తున్న మన యువతరం రచయితలు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, పరిశోధకులు... వారందరికి అభిమానపూర్వకంగా, వాత్సల్యపూర్వకంగా ఉ చితంగానే అందజేద్దామని జాజులగౌరిగారు ప్రతిపాదించారు. దానికి ఆహ్వాన సంఘం సబ్ కమిటీ

ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆవిష్కరించిన పుస్తకాలను ఎప్పటికప్పుడు సభలో తిరిగి అందించారు. అలా కనీసం పదిహేను పుస్తకాలు ప్రతి ఒక్కరికి అందించడం జరిగింది. మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా ప్రతి ఒక్కరికీ అన్ని పుస్తకాలు సక్రమంగా అందించడంలో మాధవి, అర్జున్ విశేషంగా కృషి చేశారు.

వేదికపై అధ్యక్షులు బి. నర్సింగరావుగారు, కర్ర, కర్మ, క్రియ బి.ఎస్. రాములుగారు, ఆహ్వాన సంఘం కన్వీనర్ కర్రె సదాశివగారు, ఎ. గవర్రా జుగారు, జాజుల గౌరిగారు, క్రిష్ రాధాకృష్ణగారు, బైసదేవదాసుగారు, హరిత్ రూడాగారు ప్రారంభ సమావేశంలో ఉన్నారు.

పుస్తకావిష్కరణలు...

మొయిలి శ్రీరాములు రచించిన బి.ఎస్. రాములు **'జీవిత రేఖలు'** పుస్తకాన్ని బి. నర్సింగరావుగారు ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘం తరఫున బి.ఎస్. రాములుగారికి ఆహ్వానసంఘం సభ్యులకు సన్మానం జరిగింది. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తు సభకు వచ్చిన రచయి తలు, కవులు, మేధావులు, కళాకా రులు, అభిమా నులు పుష్పగుచ్ఛం, శాలువాలతో సన్మానించారు.

దరకమే ఐక్యవేదిక పుస్తకాల ఆవిష్కరణ

మహబూబాబాద్ నుంచి వచ్చిన దరకమే ఐక్యవేదిక రచయితలైన కె. సీతారాములు, సయ్యద్ ఖుర్షీద్, మద్దెర్ల రమేష్ పుష్పగుచ్ఛంతో సన్మా నించారు. గుర్రం సీతారాములు, ఖుర్షీద్, మద్దెర్ల రమేష్... జనగామ నుండి వచ్చిన ప్రొ. సుధాకర్...

ఆ తర్వాత కె. సీతారాములు గారి ఆధ్వ ర్యంలో మహబూబాబాద్ జిల్లా దరకమే ఐక్యవేదిక రచయితలు రచించిన **'కొత్తతోవ'** కవితా సంపుటి...

కె. సీతారాములు రచించిన **'సంక్షోభం నుంచి సంక్షేమం దాకా'** వ్యాస సంపుటి...

'మళ్లీ మళ్లీ ఉదయిస్తాను' మద్దెర్ల రమేష్ కవిత్వం...

బి.ఎస్. రాములుగారి **'భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు – ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్'** సిద్ధాంత గ్రంథంను డా॥ అంకం, ఎడవెల్లి కృష్ణ ఆవిష్కరించారు.

మధ్యాహ్నం 1:15 ని॥ల దాకా సాగిన మొదటి సెషన్‌లో ఈ క్రింది పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి.

జాజుల గౌరి రచించిన **'చెట్టు నీడ'** కథల సంపుటిని 'నేటినిజం' సంపాదకులు, సీనియర్ జర్నలిస్ట్, సహస్రాధిక రచయితలకు, కవులకు తన పత్రిక ద్వారా వెలుగులోకి తెస్తున్న బైస దేవదాసు గారు ఆవిష్కరించారు.

లతారాజా ఫౌండేషన్ తరఫున కె.కె. రాజా గారు ప్రచురించిన **డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఎవరు ? ఏం చేశారు?** ఘంటా మనోహర్‌గారి పుస్తకం...

డా॥ వానరవేణి రచించిన 'నారుమడి' బాలసాహిత్య ప్రసంగ

వ్యాసాలు...

'దరకమే ఐక్యవేదిక' రెండు దశాబ్దాల చరిత్రను **'దళిత సాహిత్య యుగం'** పేరుతో బి.ఎన్. రాములుగారి సంపాదకత్వంలో వెలువడిన పుస్తకాన్ని బి. నర్సింగరావుగారు...

కాలువ మల్లయ్యగారు కొన్ని పుస్తకాలను ఆవిష్కరించారు.

'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం' పుస్తకాన్ని బి. నర్సింగరావు, ద్యావనపల్లి సత్యనారాయణ ఆవిష్కరిం చారు.

కవులందర్ని ఒక్కటిచేసిన సుప్రసిద్ధ కవి యాకూబ్ **'జీవితం అంటే ఏమిటి?'** తాత్విక సామాజిక సర్వస్వం వంటి గ్రంథాన్ని ఆవిష్కరించారు.

దేశవ్యాప్తంగా అనేక మలుపులకు తాత్విక రంగంలో కారణమైన **'గతితర్క తత్వదర్శన భూమిక'** తాజా నాల్గవ ముద్రణను బి. నర్సింగరావుగారు...

బి.ఎస్. రాములు, శరత్ పాటిల్, భరత్ పతంకర్‌ల రచన **'గతితత్వం అంబేద్కరిజం మార్క్సిజం'**...

సమగ్ర సామాజిక వికాసమే **'బహుజన తత్వం'**

బి.ఎస్. రాములుగారి స్వీయ చరిత్ర ఒక సామాన్యుడి జీవనగమనం (600 పేజీలు) మొదటి సంపుటి, రెండవ సంపుటి (600 పేజీలు) ఆవిష్కరణ

'సంభాషణ' వ్యాస సంపుటి బి.ఎస్. రాములు

'నాగశాల' కథల సంపుటి బి.ఎస్. రాములు

'బౌద్ధం, సోషలిజం మార్క్సిజం అంబేద్కరి జం ప్రతీత్య సముత్పాద' అనే తాత్విక గ్రంథం తెలుగు పుస్తకంతో పాటు ఇంగ్లీషు అనువాద పుస్తకం రెండు ఆవిష్కరించ బడ్డాయి.

'భారతీయ వ్యక్తిత్వ నిర్మాణం'... చైతన్య కిరన్ ఎర్రాగారి **'మార్క్సిజం మార్మికత'**

'స్యూడిజెర్స్' (కొత్త కోరికలు) ఇంగ్లీషు అనువాదం...

'వ్యక్తిత్వ నిర్మాణం' బి.ఎన్. రాములు...

'బి.ఎన్. రాములు కథలు తెలంగాణ జనజీవన చిత్రణ' అన్నందాస్ జ్యోతి పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం బి. నర్సింగరావు ఆవిష్కరిం చారు.

బి.ఎన్. రాములుపై వది పద్యాలు తాండ్ర చిరంజీవి పాడి వినిపించారు.

ఉస్మానియాలో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ ఎన్. ఐలయ్య సన్మానపత్రం ఫ్రేం కట్టించి చదవడంతో పాటు మరో పంద చరణాల కవిత వినిపించారు. శాలువతో సన్మానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీగా రిటైరైన సుప్రసిద్ధ కవి, రచయిత అంగలకుర్తి విద్యాసాగర్, ఐఏఎస్‌గారు బి.ఎన్. రాములు జీవితాన్ని కావ్య రూపంలో గానం చేశారు. సంక్షిప్తంగా జీవితాన్ని తన కవితాగానంతో వినిపించడం విశేషం.

రెండు విష గుళికలు, ఒక అమృత భాండం అను



ఓ సామాన్యుని సామాజిక తత్వైక జీవనయానం:

''పటాటోపపు పదజాలాల బడిలో
పాతాళ లోకపు భావనలనే ఓనమాలు దిద్ది
ధర్మ కర్మల పాచికలకు పాప పుణ్యాల పైమెరుగులద్ది
అసంఖ్యాకుల అనామకులుగ తీర్చిదిద్దే
అసమ సమాజపు అచ్చుపై అనితర సాధ్యపు
ఆధిపత్యానికొక అనుమతి పత్రాన్ని తనకుతానే ఇచ్చుకుంటూ
అనవాలే లేని వాడికి అనాది ధర్మం పేరున
అనంత లోకపు మంచి చెడుల కర్తృత్వ మిచ్చిన అమానవీయుల ఆదరణలో
లోక కళ్యాణమంటే ఇది కాబోలుననుకొను పసి వయసులోనే
సూర్యునికి సైతం దివిటీలు తిప్పే పీఠాధిపతుల చేతి వాటం
తొలి సారి తనకో సందేహ పూరిత సందేశమిచ్చింది.
ఇది మన దారి కాదని మనసు బుద్ధి మరి మరీ హెచ్చరించాయి".

మామిడి ఇంద్రాణి బి.ఎన్. రాములుగారిపై ఆత్మీయ ప్రసంగం చేశారు.

బి.ఎన్. రాములుగారి కవిత మద్దెర్ల రమేష్...

కరీంనగర్‌కు చెందిన డా॥ బొద్దుల లక్ష్మయ్య

''అరయ శ్యామల యర్ధాంగి
కాగితనేలన అలికేస్తు
కలమను హలముతో
జ్ఞానసేద్యమును
కవి కర్షకుడై పండిస్తూ
చరణం: తత్వసిద్ధి గలిగించే తపస్వి...
అజ్ఞాన తిమిరమును తొలగించే మహర్షి
ఈ విశ్వమంతట విస్తరించెను మీ యశస్వి...

డెబ్బై ఐదవ జన్మదిన శు భాకాంక్షలు

మా బీ ఎస్ రాములు సారు...

మార్గదర్శి బిఎస్ రాములు గారికి అమృతోత్సవ జన్మదిన శు భాకాంక్షలతో

కన్వీనర్ డాక్టర్ కర్రె సదాశివ్ రాసిన కవిత

"కాల ప్రవాహం పై చెరగని సంతకం"

జీవిత భయాలను దాటి
కష్టాలను కన్నీళ్లను ఒడిసి పట్టుకొని
మట్టి పాదాల పాదముద్రలను
అక్షర సాక్షాలుగా మలిచిన అక్షర ఋషి
కొండలు లోయలు అరణ్యాలను దాటు కుంటూ
భూమికి స్నానం చేసి నది
జీవిత సముద్రంలోకి చేరినట్టు
మీ జీవన గమనం ఆదర్శం
మీ అక్షరం అగ్ని పునీతం
మీ సాహసం స్ఫూర్తిదాయకం
మనిషి మనిషిలా బ్రతకడం
మానవత్వంతో బతకడం
అందరిలో కలిసిపోవడం
అందరి వాడిలా మిగలడం
మీకే సాధ్యం.

ఈ సామాజిక చరిత్రలో బి.ఎస్. రాములు గారి సంబంధం అనుబంధం అతి గొప్పది సమాజంలో తను తన తల్లిదండ్రులకు కొడుకుగా, తన తోబుట్టువులకు అన్నగా తమ్ముడిగా, తన బిడ్డలకి తండ్రిగా మాత్రమే కాకుండా తన కుటుంబ పరిధిని దాటి సమాజం పట్ల పై సంబంధాల బాధ్యతను ఆయన తీసుకున్న చొరవ అతి గొప్పదని

జాజులగౌరి బి ఎస్ రాములు పై ఒక పాట పాడి సభను అలరించారు.

"నాగమల్లెలే ఏ పువ్వు లేదే పువ్వులేదో
మా నాయిన రాములోలే లేవ్వరు లేరేవ్వరు లేరో
అల్లియ్య పువ్వోలే పువ్వు లేదే పువ్వు లేదో
మా అన్న రాములోలే లేవ్వరు లేరేవ్వరులేరో
కొండ మల్లెల్లె ఏ పువ్వు లేదే పువ్వులేదో
మా నా కొడుకు రాములోలే లేవ్వరు లేరేవ్వరు లేరో
తంగేడు పువ్వోలే పువ్వు లేదే పువ్వు లేదో
నా తమ్ముడు రాములోలే లేవ్వరు లేరేవ్వరులేరో"

తదితర పాటలు, పద్యాలు పాడి వినిపించి సభను ఉత్సాహభరితం చేశారు.

జాజుల గౌరీ రాసిన **'చెట్టు నీడ** కథలు సంపుటిని బైస దేవదాసు గారు ఆవిష్కరించారు. జనగామ లెక్చర్ సుధాకర్ సంక్షిప్త సందేశం అందించారు.

సభా నిర్వహణలో క్రిష్ రాధాకృష్ణ గారు చలోక్తులతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు నవ్వులు పూయించారు. తెలుగులో, ఇంగ్లీషులో, హిందీలో సామెతలను, పాటలను, పద్యాలను, కబీర్ దోహాలను వినిపించి సభను అలరించారు. క్రిష్ రాధాకృష్ణ

అంతర్జాతీయ స్థాయిలో అనేక దేశాల్లో వ్యక్తిత్వ వికాసం, లీడర్‌షిప్, జ్ఞాపకశక్తి తదితర అంశాల్లో ట్రెయినర్‌గా, గురువుగా అనేక సంస్థల సిఈవోలకు, మేనేజింగ్ డైరెక్టర్లకు శిక్షణ ఇస్తుంటారు.

శ్రీమతి అనురాధ గారు సదాశివపేట నుండి వచ్చారు బిఎస్ రాములు గారి చిత్రాన్ని రావి ఆకుపై చిత్రించి వాటికి లైట్స్ వెలిగే విధంగా అమర్చిన నూతన ఆవిష్కరణ ఇది. అలా మహనీయులైన అనేక మంది చిత్రపటాలను రావి ఆకుపై గీయడం ఒక కళ. ఈ నూతన చిత్రాలను బి నర్సింగరావు గారు ఆవిష్కరించారు

మార్గదర్శి బి.ఎస్. రాములు అమృతోత్సవ ఆహ్వాన సంఘం కరపత్రం బిఎస్ రాములు ముఖచిత్రం తో అందరినీ ఆకర్షించింది.

మధ్యాహ్నం 1:15 ని॥ల నుంచి రెండు గంటల దాకా భోజన కార్యక్రమం. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పరిశోధకులు, రచయితలు, ప్రొఫెసర్లు, సాహిత్య అభిమానులు పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. వారు ప్రచురించిన పుస్తకాలు పరస్పరం ఇచ్చిపుచ్చు కున్నారు.

సుప్రసిద్ధ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరి, ద్యావనపల్లి సత్యనారాయణ, వాత్సల్య, ఎం. నారాయణరావు, ముంజేటి రామారావు, నందిని నిర్మల, ఎ. తేజస్వి, రాజు మోరె, పొన్నాల ఉపేందర్, గొర్ల బుచ్చన్న, చిక్కొండ్ర రవి, జి. రామారావు, పెద్దూరి వెంకన్న, సమీర్, శ్రీరామచంద్రరావు, ఎన్. విజయశ్రీ, బి. రామచందర్, భార్గవ రామచంద్ర, ప్రొ. డి.ఎం. రవిప్రసాద్, బండి సాయన్న, డా॥ కాంచనపల్లి గోవర్ధనరాజు, ఎ. ఆర్. శ్రీనాథ్, డా॥ రాపోలు జగన్, మీడియా టుడే పత్రిక ఎడిటర్ కె. కోటేశ్వరరావు, అవునూరి సమ్మయ్య, పుట్టా పాండురంగయ్య, చిలువేరు యాదగిరి, కె. స్వామి, హరిబాబు తదితరులు, జర్నలిస్టులు, రచయితలు, పరిశోధక విద్యార్థులు, గ్రూప్-1 పరీక్షలు తయారవుతున్న విద్యార్థులు, పలువురు హాజరై పరస్పరం ముచ్చటించు కున్నారు.

మధ్యాహ్నం సెషన్‌లో ఆహ్వానపత్రంలో పేర్కొన్నవిధంగా అనేక సెమినార్ పత్రాలు సంక్షిప్తంగా వినిపించడం జరిగింది.

కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, సంగిశెట్టి శ్రీనివాస్, మారోజు దేవేంద్ర

1) 25 ఏళ్ళ (2000 – 2024) కథా సాహిత్యం పై వక్తలు ప్రసంగించారు.

2) 25 ఏళ్ళ తెలంగాణ వచన కవిత్వం పై అన్నవరం దేవేందర్, రాజ్‌కుమార్, యాకూబ్ ప్రసంగించారు.

3) 25 ఏళ్ళ తెలంగాణ నవల గురించి సుప్రసిద్ధ రచయిత్రి వి. శాంతి ప్రబోధ, కె.ఎల్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అద్దంకి ప్రజాపతి

ప్రసంగించారు.

4) 25 ఏళ్ళలో తెలంగాణలో పాట నిర్వహించిన పాత్ర గురించి బీ. నర్సింగరావు, డా॥ అందెశ్రీ, డా॥ పసునూరి రవీందర్, జనగామ శంకర్, డా॥ కోయి కోటేశ్వరరావు, డా॥ చిలుక భాస్కర్ ప్రసంగించారు.

5) చరిత్రను మలుపు తిప్పిన దరకమే ఐక్యవేదిక 1990–2010 అంశంపై జాజుల గౌరి, డా॥ కర్రె సదాశివ్, ఎ. గవర్రాజు, కె. సీతారాములు, ఎం. అనంతయ్య ప్రసంగించారు.

6) 25 ఏళ్ళ తెలంగాణ సాహిత్యం విమర్శ, పరిశీలన విమర్శ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ వంగా త్రివేణి, 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆచార్య పిల్లలమర్రి రాములు ప్రసంగించారు.

7) 25 ఏళ్ళ బహుజన సాహిత్యం అంశంపై బి.ఎస్. రాములు.

8) 25 ఏళ్ళ తెలంగాణ మైనారిటీ ముస్లిం సాహిత్యంపై సయ్యద్ ఖుర్షీద్...

9) భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు 'బీసీ నోట్‌బుక్' డా॥ ఆచార్య మాడభూషి శ్రీధర్, ఎ. గవర్రాజు ప్రసంగించారు.

10) 25 ఏళ్ళ విశాలసాహిత్య అకాడమి సృష్టించిన సామ్రాజ్యం పై బి.ఎస్. రాములు ప్రసంగించారు.

11) 25 ఏళ్ళ తెలంగాణ బాల సాహిత్యంపై వాసరవేణి పరశురామ్ ప్రసంగించారు.

12) 25 ఏళ్ళ తెలంగాణ మహిళా సాహిత్యంపై జూపాక సుభద్ర, మారోజు దేవేంద్ర, బండారు సుజాత ప్రసంగించారు.

13) గత 25 ఏళ్ళలో తెలంగాణవారి స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు అనే అంశంపై బి.ఎస్. రాములు, బండారు సుజాత ప్రసంగించారు.

14) 25 ఏళ్ళలో తెలంగాణ పత్రికా రంగంలో మహిళల భూమిక, పత్రికా సంపాదకులు అంశంపై జూపాక సుభద్ర ప్రసంగించారు.

15) సామాజిక తాత్విక రంగంలో అరసం నుండి దరకమే ఐక్యవేదిక దాకా 25 ఏళ్ళ తెలంగాణ సాహిత్యంలో వర్గం, కులం, జెండర్ అనే అంశాలపై జాజుల గౌరి, జూపాక సుభద్ర ప్రసంగించారు.

16) 1995 నుండి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సాహిత్యం, ఉద్యమాలు, సిద్ధాంతాలు, చరిత్రలు, తెలంగాణ అస్థిత్వం పై కోయి బి. నర్సిం గరావు, బి.ఎస్. రాములు, కోటేశ్వరరావు ప్రసంగించారు.

చివరి సెషన్‌లో సాయంత్రం పాణిగ్రాహి బేతి రచించిన హిస్టారికల్

(మిగతా4వ పేజీలో..)













(3వ పేజీ తరువాయి...)

ఫిక్షన్ నవల **'ద గ్రేటెస్ట్ బ్యాటిల్ ఆఫ్ కల్చర్'**ను బి. నర్సింగరావుగారు, బి.ఎస్. రాములు, బేతి శ్యామలు, సులేఖ, మాధురి, ప్రముఖ్, ఆరుష్ కుటుంబ సభ్యులు... మొదలైన కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని ఆవిష్కరిం చారు. హరప్పా నాగరి కత, ఆర్యుల ప్రవేశం గురించి నూతన జీనోం డిఎన్ఏ పరిశోధనల వెలుగులో రాసిన నవల ఇది అని బి.ఎస్. రాములు సంక్షిప్తంగా వివరించారు. ఈ నవలపై అనేక ప్రశంసాత్మక సమీక్షలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు.

సాయంత్రం 5:30 గం॥ల తర్వాత సెషన్‌లో

బి.ఎస్. రాములు కథా సాహిత్యం డా॥ నల్లా ప్రభావతి దేవి, బి.ఎస్. రాములు నాగశాల కథలు ఒక విశ్లేషణ – డా॥ ఆసనాల విమల ప్రసంగించారు.

1. బి ఎస్ రాములు కథలు వస్తువు శైలి శిల్పం వివిధ దశలు – డా॥ కర్రె సదాశివ్, డా॥ అన్నందాస్ జ్యోతి...

2. బిఎస్ రాములు తాత్విక రచనలు–ఒక పరిచయం, విశ్లేషణ – డా. కంచ ఐలయ్య, డా. వంశీధర్, చైతన్య కుమార్ ఎర్రా, కర్రె సదాశివ్, బద్రి నర్సన్, మొయిలి శ్రీరాములు, కరీం, ఎ. గంగా రెడ్డి, హరిత్ రూడా, ప్రొ. డి.ఎం. రవిప్రసాద్, డా॥ బండి సాయన్న, ఎం. భాగ్యలక్ష్మి, ఓబీసీ; అన్నందాస్ జ్యోతి, ఎలగొండ రాములు, నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్, ఇంద్రాణి, జనగామ శంకర్, ప్రొ. డా॥ ఎస్. ఐలయ్య, డా॥ కోయి కోటేశ్వరరావు మొ॥. ఈ క్రింది విధంగా ప్రసంగాల పరంపర కొనసాగింది.

3. బి ఎస్ రాములు నవలలు సామాజిక పరిణామాల చిత్రణ – మోరె రాజు, ప్రొ. అద్దంకి ప్రజాపతి

4. బి ఎస్ రాములుగారి చరిత్ర దృక్పథం – డా. ద్యావనపల్లి సత్యనారాయణ, కత్తి పద్మారావుగారు సందేశం పంపించారు.

5. తత్వశాస్త్రం, చరిత్ర అధ్యయనం, అలంకార శాస్త్రం, సాహిత్య విమర్శలో బి యస్ రాములు మౌలిక చేర్పులు – బద్రి నర్సన్, జాజుల గౌరి. ఈ విషయంపై మాట్లాడవలసిన డా॥ కంచ ఐలయ్య, అడపా సత్యనారాయణ సమయాభావం వల్ల చదవలేకపోయారు.

6. బి సి నోట్ బుక్, సామాజిక న్యాయం అంటే ఏమిటి – ఒక పరిశీలన – డా॥ ఎ.గవర్రాజు, ఆచార్య మాడభూషి శ్రీధర్, మిగతా వక్తలు సమయాభావం వల్ల చదవలేకపోయారు.

7. తెలంగాణ ఉద్యమంలో బి యస్ రాములు – 1996 – 2024 – పాశం యాదగిరి...

బిఎస్ రాములు నాగశాల కథలు – డాక్టర్ ఆస్నాల విమల, వరంగల్.

25 ఏళ్ల సామాజిక ఉద్యమాలు – సాహిత్యం – డాక్టర్ కర్రె సదాశివ్, తాళ్లపెల్లి సంజీవ్...

బి.ఎస్. రాములు కవిత్వం – తాటిపాముల రమేష్, గుండు కరుణాకర్ వ్యాసం రాసి పంపారు.

బి.ఎస్. రాములు కథా సాహిత్యం – డా॥ నల్లా ప్రభావతిదేవి

బౌద్ధం, మార్క్సిజం తులనాత్మక అధ్యయనం – బొర్రా గోవర్ధన్‌గారు రాలేకపోయారు.

దేశీ తాత్వికుడు విశాల స్వాప్నికుడు బి.ఎస్. రాములు – డా॥ నందిగామ నిర్మల

బి.ఎస్. రాములు ఒక సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం – డా॥ కత్తి పద్మారావు

బహుముఖ బహుజన మేధావి బి. ఎస్. రాములు – కె.ఎస్. చలం

75 వసంతాల కృషీవలుడు బి.ఎస్. రాములు – ఆచార్య వానపల్లి



వెంకట్రావు

మార్గదర్శి బి.ఎస్. రాములు – చైతన్య కిరణ్ ఎర్రా

బి.ఎస్. రాములు కథలు శిథిలమవుతున్న కుల వృత్తులు – డా॥ అన్నందాస్ జ్యోతి

తెలంగాణ ఐకాన్ బి.ఎస్. రాములు – శిరందాస్ శ్రీనివాస్

బిఎస్ రాములు సాహిత్యం – మహిళా సాధికారికత – తాళ్లపల్లి సువర్ణ వీరిలో కొందరు పత్రికలల్లో వ్యాసాలు ప్రకటించారు. ప్రసంగాలు చేశారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బండి సాయన్న... వేదికను అలంకరించిన...

సాయంత్రం చివరి సెషన్‌లో తెలంగాణ సినిమా గురించి హరిత్ రూడా చర్చిస్తూ అనేక ప్రతిపాదనలు చేశారు.

భవిష్యత్తులో తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి క్రిష్ రాధాకృష్ణ సభికుల అందరిచేత చెప్పి, చదివించి ఆమోదింపజేశారు.

సభ ఆమోదించిన తీర్మానాలు

1.ఆధునిక భారతీయ సామాజిక తత్త్వవేత్త బి.ఎస్. రాములు గారికి "మార్గదర్శి"గా బిరుదును ఈ సభ ప్రధానం చేస్తున్నది.

2.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరి సేవలను సాహిత్య అకాడమీ ఛైర్మన్‌గా, అధికార భాషా సంఘం ఛైర్మన్‌గా, ప్రభుత్వ సలహాదారుగా వినియోగించుకుంటే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఈ సభ విశ్వసిస్తున్నది.

3.సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, తాత్విక రంగాలకు చేసిన వీరి బహుముఖీన కృషివల్ల పెద్దల సభ అయిన రాజ్యసభకు మరియు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులకు అపార గౌరవం చేకూరుతుందని ఈ సదస్సు విశ్వసిస్తున్నది.

4.సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం అనే సంస్థ వీరి ఆధ్వర్యంలో గత 25 ఏళ్ళుగా పనిచేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ సంస్థను విస్తరించి 100 ఎకరాల్లో, 100 కోట్లతో బహుళార్థ సార్థకంగా సామాజిక తాత్విక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి దేశానికే తలమానికంగా నిలవాలని ఈ సదస్సు ప్రతిపాదిస్తున్నది.

5.బి.ఎస్. రాములు ఫౌండేషన్ ఏర్పాటు చేసి వారి పేరిట బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి యువజన సాహిత్య, సాంస్కృతిక కళాకారులకు, విద్యార్థులకు శిక్షణా తరగతులు, ఉన్నత విద్యాభ్యాసానికి స్కాలర్‌షిప్‌లు అందజేయడం ద్వారా యువతరానికి దేశీయ స్ఫూర్తి లభిస్తుంది అని ఈ సభ భావిస్తున్నది.

6.వీరి రచనలను భారత రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషల్లోకి అనువదించడం కోసం ఒక సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ ప్రజల సంస్కృతి, తాత్వికత విశ్వవ్యాప్తమవుతుంది. పాఠశాల, కళాశాల, గురుకుల పాఠశాల గ్రంథాలయాలలో వీరి గ్రంథాలను కొనుగోలు చేసి ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం అవసరమని ఈ సదస్సు భావిస్తున్నది.

7.బీసీ కమిషన్ ఛైర్మన్‌గా ప్రత్యేక కృషితో వెలువరించిన 'భారత రాజ్యాంగం – బీసీ నోట్‌బుక్' గ్రంథాన్ని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించడం ద్వారా ప్రజలు తేలికైన భాషలో అర్థం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఈ సదస్సు విశ్వసిస్తున్నది.

బి.ఎస్. రాములు తాత్వికత పై ప్రసంగాలు

25 ఏళ్ళ బి.ఎస్. రాములు తాత్విక ఆలోచన పరిణామం గురించి ఉస్మానియా యూనివర్శిటీ ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు డా॥ వంశీధర్, జాజుల గౌరి, డా॥ కర్రె సదాశివ్, ఎ. గవర్రాజు, జూపాక సుభద్ర, డా॥ పిల్లలమర్రి రాములు తదితరులు సుదీర్ఘంగా ప్రసంగించారు.

"1985 నుండి బి.ఎస్. రాములు వ్యాప్తంగా భారతీయ సమాజాన్ని తాత్వికంగా ఎలా మలుపు తిప్పారో విశ్లేషించారు. సాహిత్య ప్రక్రియల్లో తద్వారా వచ్చిన అనేక మార్పులను వారు సంక్షిప్తంగా పేర్కొన్నారు. నక్సలైట్ల ఉద్యమంలో కుల సమస్యపై, నిర్బంధంపై బహిరంగ అవకాశాలను వాడుకోవడంపై, ఎన్నికల్లో పోటీ చేయడంపై తదితర అంశాలపై చేసిన చర్చలు, అందుకు ప్రాతిపథికగా రాసిన సిద్ధాంత ప్రతిపాదనలను పీపుల్స్‌వార్ పార్టీ అచ్చువేయడానికి, కార్యకర్తలకు పంపిణీ చేయడానికి నిరాకరించడంతో వాటిని 'గతితర్క తత్వదర్శన భూమిక'గా మార్చి అచ్చు తీశాయి. సాహిత్య రంగంలో, అలంకార శాస్త్రాల్లో బహుజన దృక్పథాన్ని విస్తరింపజేసి సాహిత్య చరిత్రను కొత్త చూపుతో ఎలా రాయాలో మార్గదర్శనం చేశాయి. ఈ విషయాలను డా॥ వంశీధర్, జాజుల గౌరిలతో పాటు జూపాక సుభద్ర చక్కగా విశ్లేషించారు.

బి.ఎస్. రాములు చేసిన నూతన కోణాల విశ్లేషణతో నక్సల్ ఉద్యమంలోకి యువకుల వలసలు పూర్తిస్థాయిలో ఆగిపోయారు. వాళ్ళంతా బి.ఎస్. నాయకత్వంలోని దరకమే ఐక్యవేదిక స్థాపనలో కలిసిరావడం జరిగింది. ఇలా వేశారు. ఈ పుస్తకం 'దరకమే ఐక్యవేదిక'కు తాత్విక భూమికగా ఏర్పరిచింది. దేశ వ్యాప్తంగా కుల సమస్యను పట్టించుకోవడానికి కారణమైంది. అలా అనేక పార్టీలలో, ఉద్యమాలలో బి.ఎస్. రాములు తాత్విక గ్రంథాలు దేశవ్యాప్తంగా చేసిన చర్చలు, మౌలిక మార్పుకు దారి మోసపూరిత మాటలతో చదువులు మానించి, ఉద్యమ కార్యకర్తలుగా మలుపుకోవడంలో ఉన్న కుట్రను బి.ఎస్. రాములుగారు బద్దలు చేశారు. ఇది అశాస్త్రీయ విద్యావిధానమే అయితే అలా చెప్తున్న అగ్రకులాల ప్రొఫెసర్లు, నాయకులు, వారి పిల్లలను, వారి కులాలవారిని ఆర్టీసీ బస్టాండ్‌లలో, రోడ్లను పరిశుభ్రం చేసేవారిగా పెట్టాలని, వారి చదువులు మానేయించాలని, అప్పుడు బీసీ, ఎస్సీలు వచ్చి చదువుకుంటారని రాష్ట్ర వ్యాప్తంగా చేసిన ప్రసంగాలు, సిద్ధాంత చర్చలు ప్రజలను కదిలించాయి. జెండాలు మోయడం తప్ప, నిర్బంధాలకు గురికావడం, ఎన్‌కౌంటర్‌లలో చనిపోవడం తప్ప ఆయా పార్టీలలో నాయకులుగా దశాబ్దాలు గడిచినప్పటికీ అగ్రకులాలవారే కొనసాగుతున్నారని జరిగిన చర్చ ఒక్కొక్క మలుపుకు దారితీసింది. వారంతా ఆ తర్వాత క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 'దరకమే ఐక్యవేదిక' స్థాపనతో చురుకుగా పాల్గొని తదనంతరం అనేక అస్థిత్వ ఉద్యమాలకు దిక్సూచి అయిందని, ఇదంతా బి.ఎస్. రాములుగారి తాత్విక భావజాలంతో పాటు దరకమే ఐక్యవేదిక నిర్మాతలు నిర్వహించిన పాత్ర మహోన్నతమైనదని వక్తలు ప్రశంసించారు. వెయ్యేళ్ళ సాహిత్య చరిత్రను మలుపు తిప్పిన ఘనత 'దరకమే ఐక్యవేదిక'కు చెందుతుంది. ఈ రోజు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, మహిళ, బహుజన మహిళలు, ఉత్పత్తి కులాలు ఈ రోజు నిర్జీవాత్మక పాత్రను సామాజికంగా, సాహిత్యంగా, రాజకీయంగా మలుపు తిప్పింది. కారంచేడు, చుండూరు బహుజన సమాజ్‌వాది పార్టీ పరిణామంలో లక్షలాది ప్రజలు సాయుధ పోరాట బాటను వదిలి ఈ జీవితంలోనే జీవితం గెలుచుకోవాలని, అభివృద్ధిలో, అధికారంలో, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో తమ వాటా రావాలని ముందుకు సాగడంలో 'దరకమే ఐక్యవేదిక' నిర్వహించిన పాత్ర మహోన్నతమైనది. యువత ఎవరికి వారు తమ జీవితాలను నిర్ణయించుకుని తమ లక్ష్యం వైపు ఎదగడానికి ఒక స్వేచ్ఛాయుత వాతావరణాన్ని మార్క్సిజం యొక్క ఆధిపత్య ధోరణి తాలూకు నిర్బంధాల నుంచి బయటపడేయడం జరిగింది.

యువతీ యువకులు ఉద్యమాలవైపు మల్లకుండా ఉన్నత విద్యావంతులుగా ఎదిగి తమ జీవితాలలో స్థిరపడడమే కాకుండా, సమాజ ఉన్నతికై అనేక సంస్థలను, కళాశాలలను, విద్యాసంస్థలను ప్రారంభించి తిరుగులేని నిర్ణయాత్మక శక్తిగా ఎదిగారు. 'దరకమే ఐక్యవేదిక' సృష్టించిన విజయాల పరంపర ఒక చెట్టు విత్తనాలు విశ్వవ్యాప్తంగా ఎదజల్లి ఎక్కడికక్కడ మొలకెత్తినట్లుగా సమాజంలో మార్పులు సంభవించడానికి భూమిక అయింది. అనేక ఫలాలనిస్తూ ఇవాళ తెలంగాణ, ఆంధ్రా ఇతర రాష్ట్రాల్లో నూతన చైతన్యం వెల్లివిరిసి అగ్రకులాధిపత్యాన్ని అన్ని రంగాల్లో ప్రశ్నించడంతో పాటు తామే ఆయా రంగాలను నిర్దేశించే స్థాయికి ఎదిగారు. ఇదంతా ఒక విత్తనం మహావృక్షంగా ఎదిగినట్లుగా సాగుతూ వచ్చిందని అని డా॥ వంశీధర్, డా॥ పిల్లలమర్రి రాములు, బి. నర్సింగరావు, కె. సీతారాములు, జూపాక సుభద్ర, జాజుల గౌరి, కర్రె సదాశివ్, ఎ. గవర్రాజు పలు కోణాల్లో విశ్లేషించారు".

ముగింపు సమావేశం

ఈ సెషన్‌కు సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ తెలుగు శాఖ అధ్యక్షులు డా॥ పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహించారు. పాణిగ్రాహి బేతి రచించిన 'ద గ్రేటెస్ట్ బ్యాటిల్ ఆఫ్ కల్చర్' పుస్తకం ఈ సదస్సులోనే ఆవిష్కరించడం జరిగింది. ముగింపు సమావేశంలో డా॥ టి. వెంకటరాజ య్యగారి ప్రసంగం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. 75మంది వక్తలకు, అతిథులకు పోచంపల్లి శాలువాలతో, ప్రశంసా పత్రాలతో సన్మానం చేయడం జరిగింది.

ఈ సదస్సు విశేషాలు

ఉదయం నుంచి రాత్రి దాకా సాగిన ఈ సమావేశాలకు మూడు, నాలుగు దఫాలుగా సభికులు వచ్చి చేరారు. కొందరు మధ్యాహ్నం, కొందరు సాయంత్రం కొత్తగా వచ్చి కలిశారు. వర్కింగ్ డే కావడంతో చాలామంది సాయంత్రం విచ్చేశారు. అలా మొత్తం 350 మందికి పైగా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని యూనివర్శిటీల నుంచి తెలుగు శాఖల వాళ్ళ విద్యార్థులను పంపడం జరిగింది. యూనియన్ పబ్లిక్ కమిషన్ సర్వీస్‌నుండి కూడా చాలామంది విద్యార్థులు హాజరయ్యారు. అంపశయ్య నవీన్, డా॥ కత్తి పద్మారావు సందేశం పంపించారు. ఎలుగొండ రాములు వ్యాసం పంపించారు.

సందేశాలు, వ్యాసాలు, కృతజ్ఞతలు

వారం పది రోజులుగా పలు పత్రికల్లో బి.ఎస్. రాములు కృషి గురించి పలు వ్యాసాలు రాసిన వారందరికి ధన్యవాదాలు. వాట్సప్‌లో, ఫేస్‌బుక్‌లో, మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసినవారికి కృతజ్ఞతలు. ఉదయం నుండి రాత్రి వరకు తొమ్మిది గంటలపాటు లైవ్ టెలికాస్ట్ చేసిన యుట్యూబర్ కడారి శ్రీధర్ 'వి' మీడియా గారికి చక్కని ఫోటోలను ఎప్పటికప్పుడు తీసిన సుప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ సిద్దార్థ గారికి, ఉదయం నుంచి రాత్రి దాకా రెండు, మూడు గంటలకు పైగా కూర్చొని వార్తలు రాసిన జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు, వి3 ఛానల్ కాచం సత్యనారాయణగారికి, ఇంటర్వ్యూను సీరియల్‌గా ప్రచురించిన ప్రజామంటలు పత్రిక, ప్రజాపాలన పత్రికలో విరివిగా వ్యాసాలు ప్రచురించిన శివభాగ్యారావు, భాస్కర్‌గార్లకు, ప్రతిపక్షం దినపత్రిక ఫజురుల్ రెహమాన్ గారికి, సాక్షి దినపత్రిక సంపాదకులు వర్రెల్లి మురళిగారికి, బైస దేవదాసుగారికి, బద్రి నర్సన్‌గారికి, మన తెలంగాణ పత్రిక సంపాదకులు అంజయ్యగారికి, ఆయా టీవీల్లో ప్రసారం చేసిన వారికి, అన్ని ఏర్పాట్లను సమకూర్చడంలో సహకరించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గారికి, ప్రసంగ వ్యాసాలను, వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకు రావడానికి అంగీకరించిన తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి గారికి, రవీంద్రభారతి సిబ్బందికి, అనేక విధాలుగా సహకరించిన మిత్రులు, సాహితీవేత్తలు అందరికి, ఆహ్వాన సంఘం తొలి సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేసిన చంద్రం బిల్డింగ్స్, దక్కన్‌ల్యాండ్ పత్రిక సంపా దకులు, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ నిర్వాహకులు ఎం. వేదకుమార్‌గారికి సభాముఖంగా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించిన రచ్చ శ్రీనివాస్, వచ్చి తమ సౌజన్యాన్ని, కానుకలను అందజేసిన డా॥ వింజమూరి సూర్యప్రకాష్, డా॥ కామేశ్వరి దంపతులకు ధన్యవాదాలు. పోచంపల్లి శాలువాలను తన సౌజన్యంతో అందజేసిన మహేశ్వరంకు చెందిన కర్నాటి మనోహర్‌గారికి, మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసిన రాజారత్న ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు డా॥ అంకం గారికి ధన్యవాదాలు.

ఈ కార్యక్రమానికి ఉదయం 10 గం॥ల నుండి రాత్రి 11 గం॥ల వరకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు బి. నర్సింగరావుగారు ముందుండి ఈ కార్యక్రమాన్ని ముందుకు నడపడం ఒక విశిష్టత.

ముగింపు ప్రసంగంలో బి.ఎస్. రాములు తమ స్పందనను తెలియజేస్తూ అందరికి అభినందనలు, శుభాకాంక్షలు, దన్యవాదాలు తెలియజేశారు.

– డా॥ కర్రె సదాశివ్– ,ఎ. గవర్రాజు–,జాజుల గౌరి

75 ఏళ్ల బహుజన తాత్వికుడు బి.ఎస్. రాములు

–డా॥ కత్తి పద్మారావు
9849741695

సామాజిక తత్వవేత్త, తెలంగాణ పోరాట సాహితీ ధీరుడు, తత్వ శాస్త్రాన్ని మదించిన గతితర్కికుడు, మానవతా దార్శనికుడు, భారతీయ తత్వశాస్త్రంలో కుల వైవిధ్యాన్ని ప్రామాణీకరించిన మరో మహాత్మా పూలే బి.ఎస్. రాములు గారి 75 ఏళ్ల జన్మదిన వేడుకలు భారతదేశ సాంస్కృతిక విప్లవానికి గొప్ప పర్వదిన వేడుకలుగా భావిస్తున్నాను. ఈ రోజున ఆయన పుస్తకాలు కొన్ని పునర్ముద్రితమైనవినాకు పంపారు. గతి తర్కం – అంబేద్కరిజం – మార్క్సిజం, బహుజన తత్వం, జీవితమంటే ఏమిటి ?, ఒక సామాన్యుని జీవన గమనం, ఒక సామాన్యుని జీవన గమనం – రెండో భాగం, the greatest battle of culture (కుమారుడు రాసినది – పాణిగ్రాహి బేతి) నాకు చేరాయి. వారికి సంబంధించిన రచనలన్నీఇంతకుముందు మా అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్లో ఒక బీరువాలో తీర్చిదిద్ది ఉండేవి. వారి మీద గౌరవంతో ఒక బీరువాకి బిఎస్ రాములు గారి పేరు కూడా పెట్టడం జరిగింది. 1989లో మా ఇంటి దగ్గర జరిగిన 15 రోజుల దళిత బహుజనుల అధ్యయన తరగతుల్లో ఆయన ప్రధాన ఉపాధ్యాయుడిగా, మాష్టార్జీ ప్రధాన వాగ్గేయకారుడిగా పాల్గొన్నారు.

ఆ పదిహేను రోజుల్లో ఆయన జీవన గమనాన్ని గురించి 100 గంటలు మాట్లాడారు. ఆ ఉపన్యాసాన్ని నేను అధ్యక్ష స్థానంలో ఉండి సాకల్యంగా విన్నాను. ఆయన ప్రధానంగా తల్లి ప్రేమికుడు. వాళ్ల అమ్మ బీడీలు చేసి చదివించిన విషయాన్ని పదేపదే చెబుతారు బి.ఎస్. రాములు గారు.ఆమె శ్రమ ధారలు ఆయన అక్షరాల్లో ప్రవహించాయి. వాళ్ల తాత ఆయుర్వేద వైద్యుడు. ఆయన ఎప్పుడు జ్వరం వచ్చినా మందులు వాడే వాడు కాదు. తాత బట్టల వ్యాపారి కూడా. కాలినడకతో వందల గ్రామాలు తిరిగిన జ్ఞానం అయినది. వాళ్ల అమ్మమ్మ మట్టి కుండలోనే వంట చేస్తుంది. బిఎస్ రాములు గారి నాన్న 1955లో బిఎస్ రాములు గారికి ఆరేళ్లు ఉన్నప్పుడే చనిపోయారు. సరైన వైద్యం అందక చనిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకుంటారు. మా చిన్నప్పుడు మా ప్రాంతంలో ఇక్కడ ఇల్లు జరక్క ముంబై బట్టల మిల్లులకు పలస వెళ్లారు అని బిఎస్ రావు గారు గుర్తు చేసుకుంటారు

. బిఎస్ రాములు గారు చిన్నప్పటినుంచి మంచి చదువరి. వారి మొదటి గురువు వాళ్ల అమ్మే. వాళ్ళ అమ్మ గురించి చెబుతూ 'మా అమ్మ ఒక గొప్ప కథకురాలు, ఆమె ఆకలి మరిపించడానికి కొన్ని వందల కథలు చెప్పింది' అంటారు. వాళ్ల నాన్న పోయే అప్పటికి వాళ్ళ అమ్మకు 20 ఏళ్లు. అప్పటికి ముగ్గురు పిల్లలు. వాళ్ళ అమ్మ వ్యవసాయ కూలి పనులకు కూడా వెళ్ళేది. ఇంట్లో బట్టలు నేసేది. బీడీలు చేసేది. ఆయన జీవితం మొత్తం వాళ్ళ అమ్మ దుఃఖం, వృధ,ఆవేదన, జీవన పోరాటం, ప్రేమ వెంటాడినయ్. ఆ ఆలోచనలూ, ఆ జీవన సత్యాలే ఆయన్ని గొప్ప రచయితగా మలిచాయి.

బి ఎస్ రాములు గారి జీవితం హిందూ సంస్కృతి పునాది నుండి ప్రారంభమైంది. ఆర్ఎస్ఎస్ శిక్షణా తరగతుల్లో ఆయన కొన్ని శిక్షణలు కూడా పొందారు. ఆయన ఏ సిద్ధాంతాన్ని అయినా తన మేధస్సు నుంచి చర్చించి దాన్ని మథించి ఒక నిర్ణయానికి వచ్చే అలవాటు ఉన్నవారు. అందుకనే ఆయన ఆర్ఎస్ఎస్ బంధనాల నుంచి త్వరగా నే బయటపడ్డారు. బిఎస్ రాములు జీవిత పరిణామం తెలంగాణ పేద ప్రజల ముఖ్యంగా పద్మశాలీలు, నేత పని వారు, బీడీ పనివారు, అద్దకం పనివారు, బొగ్గు గనుల్లో పనిచేసే వారు, వారందరి జీవన వెధల ఘర్షణ నుండి ఆవిర్భవించింది. ఆయన చదువుకున్న విధానం మనం పరిశీలిస్తే దళిత బహుజనులు భర్త చనిపోయిన వారు ఎన్ని కష్టాలు, ఎన్ని బాధలు, ఎన్ని అవమానాలు, ఎంత జీవన ఘర్షణ నుండి పిల్లల్ని చదివిస్తారు అని బిఎస్ రాములు గారి కథలు గాని మనం భారతదేశంలో ఒక సినిమాగా తీయగలిగితే అది ఆస్కార్ లెవెల్ కు వెళ్తుందని చెప్పక తప్పదు. ఆయన కథ చదువుతూ వింటూ ఉంటే మా అమ్మ నాన్న కూడా గుర్తుకొచ్చారు. చదువు కోసం కష్టాలు పడ్డ ఆయన కథ వింటే ప్రతి తల్లి గుర్తుకొస్తారు. భారతదేశంలో త్వరగా భర్తలు చనిపోవడం అనే స్థితి పెరిగిపోతుంది. ఈ జీవన గాథల ఘర్షణల నుండి గొప్ప గొప్ప వ్యక్తులు కూడా ఆవిర్భవిస్తారు.

అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ నుండి జన్మదిన అక్షరకుసుమాంజలి.















వివిధ కవులచే
కవితాత్మకంగా
జీవిత సత్యాల ఆవిష్కరణం
సామాజిక బ్రతుకుఘటనల
వ్యాఖ్యానం

ఈ వారం నేటినిజం సాహితీ కిరణాలు కు ఎన్నికయిన సప్తపదులు

29 ఆగస్టు '2024

దేహం
మోహం
ఎంత నేర్చినా జ్ఞానానికి పరాకాష్ఠ 'సోళిహం!'
-ఎన్ ఆర్ తపస్వి, చెన్నై

కప్పకు
విప్పకు
ఎవరి గురించి ఎవరికీ చెడుగా చెప్పకు
-ఆర్. రమాదేవి హైదరాబాద్

ధనము
ఘనము
పొదుపు, మదుపు అదుపుతో ఆదరించగ జనము
-డా॥ చిట్యాల రవీందర్ హైదరాబాదు

చీల్చడం
కూల్చడం
మారాక ప్రభుత్వం తప్పదా యిటువంటి ఆగడం
-రావెల పురుషోత్తమరావు అమెరికా

రమ్యం
గమ్యం
జీవితంలో ఎదగాలంటే ఉండకూడదు
ఇతరులతో తారతమ్యం
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య మహబూబ్ నగర్.

అచ్చట
ఇచ్చట
చరవాణి రాకతో కరువైంది ముద్దు , ముచ్చట!!
-సిద్ధిరెడ్డి యామినీ సౌజన్య, లండన్ (యు.కే.)

చందాలు
దందాలు
దేవుడు, భక్తిపేర మొదలైన దబాయింపు ఆరిందాలు
-పట్నాల ఈశ్వరరావు విజయనగరం

తత్వము
మూర్తిమత్వము
ఆపదలో ఉన్నవారిని,అన్నార్తులను ఆదుకోవడమే 'మానవత్వము'
-బిక్కుమూరి రాజేశ్వర్, నిర్మల్

అసలు
కసలు
పగటి కలలు చెల్లవు - ఫలితాలే సిసలు
-అభిషేక్. హైదరాబాద్

వారు
వీరు
కాలం గడచిన ఒకరికొకరు దూరం
అవుతారు.
-గుండం మోహన్ రెడ్డి నర్సాపూర్,మెదక్

తల్లులు
పిల్లలు
మాతృభాష మాధుర్యాన్ని పంచుతూ చెరిపేద్దం ఎల్లలు!!
-అవసరాల పద్మజారాణి.విజయనగరం

వింతలు..!
చింతలు...!!
బతుకు బాటలో పడవేసే ప్రమాదకర
గుంతలు....!!!
-మహమ్మద్ అంకూస్,బెల్లంపల్లి

వివాదాలు
సంవాదాలు
రాజీపడని వ్యక్తుల మధ్య పెరుగుతాయి తగాదాలు!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ హైదరాబాదు.

నవతరం
యువతరం
భవ్యదీప్తులై భావిభారతనీ ఆశాకిరణాలై అలరించాలి నిరంతరం
-డా. ఉషారాణి కోగంటి,హైదరాబాద్

బియ్యం
నెయ్యం
ఆహారపు అలవాట్లతో చాలామందికి మధుమేహనీ దయ్యం
-కాశీ మూర్తి ,హైదరాబాద్

ఇక్కడ!
అక్కడ!!
ఎక్కడి మాటలక్కడే గప్ చిప్ మరిచిపో ఎక్కడికక్కడ!!!
-నేమాన సుభాష్ చంద్ర బోస్ విశాఖపట్నం

కదులు!
మెదులు!!
ఎవరూ వదిలిపెట్టడం లేదు అందుకే సప్తపదులు!!!
-ఎమ్మెస్సార్ భార్గవి ప్రియ, విజయవాడ

గుంపు
వేధింపు
తిరగబడ్డ స్త్రీచైతన్యమే చెపుతుంది అఘాయిత్యాలకు ముగింపు.
-బొడ్డ కూర్మారావు విశాఖ పట్టణం

రాత
గుండెకోత
వ్యక్తిగత విషయాలపై ప్రసారమాధ్యమాలు కలిగిస్తున్నాయి రోత
-శేష శైలజ(శైలి), విశాఖపట్నం

అంకము
చరమాంకము
వృద్ధాప్యంలో కన్నబిడ్డలు తోడుంటే అదే సుఖాంతము
-హైమ. కందుకూరి హైదరాబాద్

బొట్టు
తాళిబొట్టు
కొందరు మహిళలు పెట్టుకోకూడదని
పెట్టుకున్నట్లున్నారు -ఒట్టు
-బి బీ రవి కుమార్ విజయవాడ

నిరోధులు
అవరోధులు
అసూయ, అహంకారం, ద్వేషం అసలైన విరోధులు
-విత్తనాల విజయ కుమార్ హైదరాబాద్

పగడము
జగడము
ప్రమాదమగు లోతైన బావి లోపలకు దిగడము
-ఈమని వెంకట మల్లికార్జున రావు. నెల్లూరు

అంతరంగం
చిత్రరంగం
గదిలోని గోప్యం తెరమీద కూడదు బహిరంగం.
-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి హైదరాబాద్.

అత్యాచారం
హత్యాచారం
మానవుడు మృగమై మహిళలను మట్టుబెట్టడం అపచారం
-కాటేగారు పాండురంగ విఠల్ హైదరాబాద్

ఆరాటం
ఆర్భాటం
జననమరణాలు కనురెప్పపాటట! మధ్యన ఆటుపోటుల పోరాటం..
-పి.బాలా త్రిపుర సుందరి హైదరాబాద్

రూపం
తాపం
అందాలను వంకరచూపుతో చూడడం పెద్ద శాపం
-శ్రీహరి , హైదరాబాద్

జ్ఞానులు
విజ్ఞానులు
లక్ష్యం లేని జీవితం గడిపేవారు అజ్ఞానులు
-రాయవరపు సరస్వతి చోడవరం,అనకాపల్లిజిల్లా

కృతి
వృతి
అవకతవకలు జరిగిన పర్యవసానం కావచ్చు మృతి
-శ్రీ పెరనీబుదూరు నారాయణ రావు 'శ్రీనారా', మాదాపూర్ ,హైదరాబాద్

ఇష్టం
కష్టం
బంధలో నమ్మకం లేకపోతే కలుగుతుంది నష్టం
-ఎస్.గిరిజశివకుమారి గుంటూరు

నొప్పి
బొప్పి
వెళ్లి పోతుంది జీవిత పాఠాలు చెప్పి
-వి శ్రీనివాస మూర్తి హైదరాబాదు

అసకు
వినకు
పనికిరాని విషయాలు నీవు కలలోనైనా కనకు
-టీవీ ధర్మారావు విజయనగరం.

మర్మం
కర్మం
మానవుని జీవనప్రస్థానంలో ఎల్లప్పుడు రక్షించేది ధర్మం.
-దామరాజు విశాలాక్షి విశాఖపట్నం.

నైతిక విలువల సమాహారం తెలుగు వాణి

శతక సుధానిధి



ప్రతులకు:
టి. మహేశ్‌బాబు
ఇ.నెం.10-14-1314,
ఆనంద్‌నగర్,
నిజామాబాద్-503 011.
సెల్: 9441793958

గుడి కూలును, నుయి పూడును
వడినీళ్ళం జెరువు దెగును, వనమునుఖిలమౌ
చెడనిది పద్యం బొకటియె
కుడియెడమల కీర్తి గన్న గువ్వలచెన్నా

గువ్వల చెన్నడు చెప్పినట్లుగా శాశ్వతముగా నిలిచేది పద్యమొకటేయన్నది వాస్తవము. తెలుగు సాహిత్య సరస్సులో ఎన్ని ప్రక్రియలు వచ్చినా సజీవ స్రవంతిలా శతకాలు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉన్నాయి? కొనసాగుతుంటాయి కూడా?

పద్య కవితా విశారద తల్లావఝ్ఝల మహేశ్ బాబు గారు నిజామాబాద్ (ప్రస్తుతం కామారెడ్డి) జిల్లా దోమకొండ పాఠశాలలో పనిచేస్తున్నపుడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శిష్యులు ఉపాధ్యాయులను సన్మానం చేసిన సందర్భంలో...

శిష్యకోటి నుండి చిల్లి గవ్వ గొనని
గురువె గురువు తనదు గురువు కొరకు
శిరమునైన నిచ్చు శిష్యుండె శిష్యుండు

తెలియజూడు మవని తెలుగువాణి అని అలవోకగా పలికిన పద్యమే తెలుగు వాణి శతకానికి పునాదివేసిందని తల్లావఝ్ఝుల మహేశ్ బాబు గారు తమ మాటల్లో చెప్పుకున్నారు. తెలియజూడు మవని తెలుగువాణి మకుటంతో వారు రాసిన తెలుగు వాణి శతకము చదువుతుంటే వేమన శతకం గుర్తుకొస్తుంది. వీరి శతకములోని పద్యాలు సరళమైన భాషలో ఉండి అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉన్నాయి. చెప్పదలుచుకున్న విషయాన్ని పద్యాలలో సూటిగా చెప్పగలిగారు.

లక్షలుండుగాక లవణమన్నమే గాని
పసిడియన్నము దిని బ్రతుకలేము
కడుపు మంట బెంచు కలిమికై దిగులేల ?

కోట్లు సంపాదించినా మనం తినేది అన్నమే తప్ప డబ్బులు కాదు. మనిషి జీవించడానికి అవసరమైన సంపాదన కోసం ప్రయత్నించాలి కానీ కడుపు మాడ్చుకొని సంపాదన కూడబెట్టుకుంటే అది ప్రశాంతతనివ్వదు. పైగా సుఖశాంతులను దూరం చేస్తుంది. అందుకే కలిమికోసం ప్రాకులాడకుండా ఉన్నదాంట్లో తృప్తిగా జీవించడమే మేలు అని ఈ పద్యంలో సూచించారు.శ్రీనరసింహ శతకము లోని లక్షాధికారియైన లవణమన్నమే గాని పద్యాన్ని గుర్తుకు తెస్తుంది ఈ పద్యం.

బద్ధకమును మించు బద్ధ శత్రువు లేదు
చురుకుదనము వలన శూరుడగును
కార్యదీక్షయున్న కాలంబు మనదని
కృషితో నాస్తి దుర్భిక్షం. అంటే కృషి చేస్తే దుర్భిక్షం ఉండదు. అంటే మనం శ్రమ చేస్తే దరిద్రం ఉండదు. మనిషిలో చురుకుదనం, కార్యదీక్ష ఉంటే ఏదైనా సాధించగలరు. అలాంటి వారికి కాలము సహకరిస్తుంది కూడా. ఏ పని చేయకుండా సోమరితనంగా ఉంటే ఏమీ సాధించలేరు. అందుకే బద్ధకాన్ని వీడాలి. బద్ధకమంత శత్రువు మరేదీ లేదని తెలుపుతూనే కృషి యొక్క గొప్పతనాన్ని ఈ పద్యంలో కవి ప్రకటించారు.

పుటము బెట్ట వన్నె పుట్టును పసిడికి
పెరుగు దరువ దరువ వెన్ననొసగు
అభ్యసనము చేత నబ్బు విద్యయునిట్లె
అభ్యాసము కూసు విద్య. అనగా నిరంతర సాధన వలన పరిపూర్ణత చేకూరును. బంగారానికి పుటము పెట్టిన కొలదీ వన్నె పెరుగుతుంది. పెరుగును చిలికితే వెన్న వస్తుంది. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నట్లు అభ్యాసము వల్ల విద్య అలవడుతుందని, ఒకమారు ప్రయత్నంలోనే ఏదీ దరిచేరదని, పని పూర్తయ్యేంత వరకు ప్రయత్నిస్తూనే ఉండాలని హితబోధ చేశారు.

చదువు నేర్చి పెద్ద పదవులొందిన నైనా
దూరముంచవలెను దుర్జనులను
మణిని దాల్చినంత ఫణి విషంబుడుగునే?

గొప్ప చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉన్నంత మాత్రాన గొప్పవాడని చెప్పలేము. మణిని తలపై దాల్చిన నాగుపాము విషాన్ని కక్కకుండా ఉండునా! అలాగే దుష్టులైన వారు ఎంత విద్యావంతులైనా, ఉన్నత పదవుల్లో ఉన్నా, వారి దుష్ట గుణాన్ని మానలేరు. అలాంటి వారి వలన మనకు ఎప్పుడూ ప్రమాదమే.. అందుకే దుర్జనులను ఎల్లప్పుడు మనం దూరంగానే ఉంచాలని సూచించారు.

గుణము లేని వాడు ధనవంతుడైనను
చెల్లబోడు సంఘ జీవితమున
కలిమి కన్న గుణమె విలువైన ధనమని
సంపద కన్నా గుణమే విలువైనదని, మంచి గుణాలు కలిగిన వాడికి సమాజంలో మంచి పేరు ఉంటుందని డబ్బు వల్ల, ధనప్రభావం వల్ల సమాజంలో విలువ పెరగదని, తెలుపుతూ మంచి గుణాలను అలవర్చుకోవాలని అంతర్లీనంగా చక్కని సూచనని మనకందించారు. కొన్నిసార్లు కొన్ని(ధనము,అధికారము) ప్రభావాల వలన పేరు వచ్చినా అది శాశ్వతంగా నిలిచి ఉండదని మనం గమనించాలి.

కుల మతాల వంటి కుహనాంతరములచే
మనను మనమె కొట్టుకోననదేల ?
పూలు వేరయినను పూజ యొక్కటి గాదే
మనుషులంతా కులమతాలను వీడి మానవులంతా ఒక్కటేనన్న భావంతో ఐకమత్యంగా ఉండాలన్న సందేశాన్ని ఈ పద్యం ద్వారా అందించారు.

మనదేశంలో విభిన్నమైన మతాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నా అందరం భారతీయులేనన్న జాతీయతా భావనను కలిగిఉండాలన్న కవి భావన ఆయనకున్న దేశభక్తిని చాటుతుంది. కులమతాల అంతరాలు దేశాభివృద్ధికి అడ్డుగోడలని మనలో మనం కలహించుకోవడం తగదని కవి అంతరంగంలోని భావనని మనం గుర్తించాలి.

ఇంకా ఈ శతకంలో సొంత బలము కన్నా సంఘ బలమె మిన్న, జెర్రికొక్క కాలు చెదిరిన లోటేమి?, దీపమున్న నాడే దిద్దుకోవలెనిల్లు, వేలు వంచకుండా వెన్న దీయగలమె?, తలను దించుకంటే తలపడుటే సొంపులాంటి సుబోధక పాదాలతో కూడిన పద్యాలున్నాయి. శ్రీసరస్వతీమాతను స్మరిస్తూ ప్రారంభించిన పద్యంతో, 108 పద్యాలతో కూడిన ఈ తెలుగు వాణి శతకాన్ని చదువుల తల్లికే అంకితమివ్వడం వారి దైవభక్తికి నిదర్శనం.

-వైరాగ్యం ప్రభాకర్,
9014559059

భద్రత ఉందా ?

ఇదేమి లోకం!?
అడవిలో ఉన్నామా..?
విషపు చూపుల
పడగ నీడలు..
చుట్టూ పొంచి ఉన్న
తోడేళ్లు..
కండకావరమెక్కిన మృగాళ్లు..
ఎక్కడ దాక్కోవాలి?
ఏ అచ్ఛాదన
కప్పుకోవాలి..
ఆడదైతే చాలు
అమానుషం..
పసిడి పాప
పండుముసలి..
ఎవరైతేనేం అగుపడని
ఆకృత్యాలెన్నో..
కీచక ఘట్టాలు
దుశ్శసన పర్వాలు
భీముడు రాడు
కృష్ణుడు లేడు.
రాజ్యమా..!?
చేవచచ్చిన చేతనవే
రక్షణ ఏది
రాక్షసత్వం
విహరిస్తోంది..
దోషం దోషిని ఎరిగి
కాలహరణమేలా..?
బిడ్డల తల్లుల
నగ్నదేహాల సాక్ష్యం
చాలదా..?
అరాచకమా..!?
ఎంత కాలం నీ స్వైరవిహారం..
పీడకలల పాడు కాలం
గతించదా..
నీ కాళ్లు విరిచి
కళ్ళుపొడిచి నిలువునా
నరికెదెవరు..
భరోసా నిచ్చేదెవరు
పురోగమనమా..!?
గొంతెత్తి సాధించిన
సాధికారత..
ఇంటా బయట
బాధ్యతల బరువుల మోత..
పంచుకొని పెంచుకునీ
సాధించిందెమిటి?
రక్షణ లేని కొలువుల్లో
సలిగే మనసులు..
తిరోగమనమా..!?
నీవే నయమేమో!
శరణ్యమేమో!
గృహంలోనే ఏదోలాగా
గుట్టుగా సర్దుకు
పోతేనో..
ఆ రోజులూ
వస్తాయేమో!.
స్వతంత్రమా..!?
అర్ధరాత్రి ఆడది
ఒంటరిగా తిరగగలదో
లేదో..
ప్రభుత్వమా..!?
ఉచిత పథకాలు
నగదు బదిలీలు
ఇచ్చుకో కాని..
బాధ్యతగా బదులివ్వు
బిక్కుబిక్కుమంటున్న
గుండె చప్పుళ్ళకు
ఇంటిలోనైనా భద్రత
ఉందా..!?
-గడ్డం సులోచన

నీ కోసమే...

చెలీ
నీకోసమే... నీ కోసమే....
ఎదురుచూస్తున్నాను
కన్నుల్లో వత్తులు వెలిగించి
కలల్లో నిన్నే ఊహించి
నీ కోసమే నిరీక్షిస్తున్నాను.
ఈ పొడగాటి చెట్టునానుకుని
ఆకాశం కేసి చూస్తుంటే
నువ్వే గుర్తుకొస్తున్నావు
పెద్దవాగు చెంత
నిలబడి నే వున్నా
నువ్వే నీరైనురగల్లై,తరగలై
తరలిపోతున్నట్టనిపిస్తుంది.
ఎండమావిలా
ఎదురుపడితే ఏంలాభం
అందకుండా ఉంటావేం?
అంటరాని వాణ్ణా? నేను
ఒంటరి వాణ్ణి చేయకు ప్రియా
నీవే నా గుండె శృతిలయ.
అహరహం శ్రమిస్తు వున్నా
నీ కోసమే ధ్యానిస్తు వున్నా
అమ్మ ప్రేమ దూరమై వున్న
నా మీద లేదా నీకు కనికరం
నీ అందమైన కౌగిలి
ఇంకెంతకాలం దూరం?.
సఖీ
నీ కోసమే.... నీ కోసమే....
నా నిరీక్షణ...నా అన్వేషణ.
-రమేశ్ సల్లగొండ

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ -కందుకూరి శ్రీరాములు, -బెల్లంకొండ సంపత్ కుమార్ -సంపాదకులు..

గురూపదేశం

నేను కవిని
కవిని నేను
నా గురువు ఆయన
ఆయన నా గురువు
కవి పుట్టుక గొప్పది
కవి రాత మెప్పు పొందేది
కవిత్వ రసవిద్యను
నేర్పిన గురువు ఆయన
నేర్పిన విద్యతో
రస పోషణ చేస్తున్న కవిని నేను.
ఆయన ఆశీరభినందన
ఇప్పుడీ సమ్మేళనం వేదుక
అప్పటి ఆ బీజాక్షరం
ఇప్పుడు మీ ముందు ఈ కవిత.
ఆనాటి ఉగ్గుపాలే
సమరభేరికి ఉక్కు కవచం
నేర్పించిన నైపుణ్యాల బరికె
సంధించిన బాణం
మందలించిన మాట
ఎలిగెత్తిన ఉత్తుంగ తరంగం
చేతులారా నమస్కరిస్తే
మనసారా అతని రక్త స్పర్శ
ఆ కవితా అక్షరాల పూలే
సువర్ణ అక్షరాల మాల
ఆయన ప్రాస
ఊపిరికి శ్వాస
ఆ కవితా విరామం
పడుతూ లేస్తున్న అలల ఆలోచన
ఆయన సమాధానోత్తర అంశం
బిక్కమోహానికి చుక్కాని !
ఆయన రాసిన గ్రంథం
తపఃఫల పాఠశుపతాస్త్రం !
ముద్దను తీగెలుగా సాగదీసి
నగచేసి రత్నాలు పొదిగితే
అదొక తాజమహల్
ఆ శిలల్ని చెక్కి చెక్కి
శిల్పాలుగా తీర్చిదిద్దితే
అదొక ఎవరెస్టు శిఖరం.
కవిత్వం పాలకడలి
అది అప్పటి మాట
కవిత్వం సముద్ర సంగ్రామం
ఇది ఇప్పటి మాట
ఆనాటి సాధారణ బాలుడు
ఇప్పుడు అసాధారణ యుద్ధనిపుణుడు.
అడిగితే ఇవ్వటం గొప్పకాదు
అడగకున్నా ఇవ్వటం గొప్ప
దైవభక్తికీ గురుదక్షిణకీ
కన్నో వేలో ఇవ్వడం
ఇతిహాసాల మాట
గురు భక్తికీ కవి శక్తికీ
కవితా కరవాలతో
పొత్తం ఊపిరిత్తిని తీసి
పాదాభిషేకం చేయడం
ఈనాటి మాట
నేను కవిని
నా గురువు ఆయన.
-కందుకూరి శ్రీరాములు
9440119245

ముచ్చట

వాకిలి చెరువుఒడ్డున చల్లబడి
అరుగులు ముచ్చటించుకుంటయి
పొద్దుతిరుగుడు పువ్వోలె
జామ తిరుగుతుంటది
వోడవని మాలిమి
సంతోషాన్ని విషాదపారవశ్యాలను
గట్లెంట పారుతున్న మాలిన్యాలను
వలపోతను పాడుకుంటయి
ఇల్లిల్లూ గొలుసు కట్టైన వరుస
నెనరు నెమ్మిక మనుగడ
శ్వేద వర్ణ ద్రవాలై అచ్చు గీస్తది
కార్య కారణ సంబంధాలు కొన్ని
కావ్య కారణ సంబంధాలు కొన్ని
అన్నీ కలబోసుకున్న తెహజీబ్
ఎగిరి పడని వడ్డించిన విస్తరి
చెప్పొచ్చేవి చెప్పరానివి
దాచివిప్పేవి మర్మమైనవి
బహుళార్థ సాధక బాధకాలెన్నో!
సమాధానాలెన్ని? సాంత్వనాలెన్ని?

తూ తూ తూ..అంటుంది రా ఈ జగతి

ఎన్నిసార్లు గుండెను
రక్తంతో తడుపుతుంటే ఊరుకుంటావు తల్లీ
ఇంకా ఎన్ని సార్లు రక్కసులు
నలుపుతూ ఉంటే బాధతో
ప్రాణాలు విడిచి వెలుతావు తల్లీ
ఒక్క ఆయుధం నీ పుట్టుకతో
వచ్చేది ఉండే తల్లీ
నీచులు తోడేళ్లు
పసిహృదయం పై రక్కుతుంటే
అంతా చీకటి అయి పోతుంటే ఏమి చేయరాక
ఏమి తోచక అంతా ఎదారైపోతుంటే
నోరు తెరవని ఈ లోకం
ఒక్కసారి చావదా
కాపలా కాసే కన్నులు ఎక్కడ పోయెనో
ఏ నీచపు నిద్రకు పోయెనో
కాపాడే చేతులు ఎవడి కాపలా కాస్తున్నాయో
అడివా?ఏమన్నా ఇది!
ఎంతకాలం ధృతరాష్ట్రుడై ఈ లోకం ఉంటుంది
ఒక్క అర్జునుడు లేడా ఒక్క శ్రీ కృష్ణుడు రాడా
ఆడపిల్ల కంటనీరు కార్చుతుంటే
కరిగే హృదయం లేకపోయిందా
ఎవడు వీడు ఏ గ్రహం నుంచి ఊడిపడ్డడు
అమ్మ పాలు తాగలేదా
ఒకరిని హింసించే పాషాణము
ఎక్కడినుంచి వచ్చి చేరింది వీడి మెదడులోకి
పియ్యి తింటున్నాడా అది తినే పందే నయం

నా రుబాయీలు

దిక్కులు పిక్కటిల్లాగా చెవులు రిక్కించింది
అంబరం ఇప్పుడే
స్వార్థం సమసిపోగా మహిన పుట్టుకొచ్చింది
సంబరం ఇప్పుడే
పొరుగువాడిని ప్రేమిస్తే వెలితి ఉండదే
జీవితాన మిత్రమా
మానవతకు చేయందించగా తరలిపోదాం
అందరం ఇప్పుడే
రైతు శ్రమపై పడి తినేటి
స్వార్థపరుడి భాజనము ఎంత
దళారుల కోరల్లోన నలిగిన రైతు భోజనము ఎంత
తరాలు మారుతున్నా పండించే భూమి తరుగుతున్నా
రైతు పట్ల మానవాళి అందించు నీరాజనము ఎంత
×చెదిరిన మనోఘటమును నిలిపే కుదురు ఏది
ముక్తినొసగగ గాయాలకోర్చు వెదురు ఏది
కైవల్యమొసగు హరినామము స్మరించి చూడు
దివికేగి పరమాత్ముడు నిలువని నుదురు ఏది
ప్రయత్నించి చూడు ఇంకో ఆకాశం ఉంది
ప్రశాంతించి చూడు ఇంకయూ ప్రకాశం ఉంది
నువు చూడని లోకం దాగుందీ లోకంలో
అసాధ్యాలూ స్వాగతించు అవకాశం ఉంది
ఒక్కసారి తోటివాడి బాధను కను
బాటసారి ఆలపించు గాధను విను
నీ ఈ సమస్యే రేపు నాదవుతుంది
ప్రేమగా నేనున్నానను మాటను అను
-రెడ్డిశెట్టి పవన్ కుమార్

అంతర్మథనం

నాలో ఎప్పుడు ఆలోచనా తరంగాల అలజడులు
రేగుతూనే ఉంటాయి
నా,నీ ల మధ్య ఆధిపత్యానికై గెలుపోటముల ఫలితాల
కోసం ఎదురుచూపులు
ఏండ్లకేండ్లు సాగుతూనే ఉంటాయి
నకిలీ నవ్వుల నవరత్నాల దగ దగల్లో,
కృత్రిమ ముత్యాల సొగసుల్లో తప్పిపోయిన సంతోషపు
చిరునామాను కనుక్కోవటంలో
నన్ను నేనే వెతుక్కుంటున్నాను
సముద్రగర్భంలో బడబానలం బద్దలైన చప్పుళ్ళు
వినపడుతున్నాయే కానీ
మీననేత్రాల్లో తళుకులను మబ్బులు కమ్మేసి హృదయం
బరువెక్కిపోతోంది
తీరని వేదనలు తీరం చేరేదెప్పుడో...
నిర్దయలో దయ ఉందని సరిపెట్టుకోవటంతోనే సరిపోదని
నాలో ఏమూలో చిన్న అలికిడి మొదలైంది... అదే
అంతర్మథనం
నా,నీ ల మాటున రొద పెడుతున్న "నానీ"లను మార్చేసి
"మన"ను మననం చేయమంది
ఎన్ని అలజడులెదురైన తొణకని కుండలా మారమంది
స్వార్థపు మబ్బులను చిరుదరహాసంతో చల్లార్చి
అరుణకిరణాల మేళవింపుతో బతుకున సింగిడిని
పండించుకోమంది **-దుగ్గి గాయత్రి**

ప్రశ్నలెన్ని? ఆశ్చర్యాలెన్ని?
ముచ్చటపడి
దేశం తీరుతెన్నులు మార్చే
జన యంత్రాంగమవుతయి
బెందెడు రాయికి కాలెక్కడ జతికిందో
తల్లి పేగు కదిరినంత బాధ!
వాడుకోవటం తెలిసినవాడు
అవసరం తీరాక
తల్లితండ్రులని శరణా గతి చేస్తున్నాడు
అదులుతున్న అరుగుకేం దిక్కు ?
అరుగెంట అచ్చు కట్టకమైన ముచ్చటింపు
తెల్ల బట్టలలో ముకిళించుకుంటున్నది
చెమట మరకంటిన దగ్గర ముచ్చటపడుతున్నది
బాల బతుకమ్మల బోసి నవ్వు లో
మనసు పడిన స్నేహ పరిమళాలలో
చల్లగా తగిలే ఆత్మ సౌగందాల
కడుపులోంచి పెల్లుబికి వచ్చే ముచ్చటేదైతే
వంచనెరుగని పచ్చనాకు మీద
మంచు బొట్టయి కరిగి లోనికి ఇంకిపోతున్నదో
దోసిలి పట్టుకొని మోకరిల్లుతాను.
- బెల్లంకొండ సంపత్ కుమార్, 9908519151

మురికి కూపంతో మునిగి తేలుతున్న వీడు
మదమెక్కితే
మార్గాలు ఎన్నో ఉన్నాయి కదా
చిట్టితల్లిని ఎట్లా చిదుముతాడు?
అమ్మ నాన్నలతో పెరగడం లేదా వీడు
ఓరీ దుష్టుడా,దుర్మార్గుడా నీచ నికృష్టుడా,
మలమూత్రములతో కడుపు నింపుకునేవాడా
తూ.....నీది ఒక బతుకేనా
అమాయకపు అమ్మల ఆడపిల్లల పీడ తగిలి
పిశాచమై పోరా
నీ పుట్టుకే అమ్మ అసహ్యించుకుంది రా
నీది ఓ బతికేనా నికృష్టుడా
నిర్మలమైన లోకంలో విషపు చుక్క అయినావు
వింత మృగమైనావు
కన్నుల ముందు నిన్ను కన్న
అమ్మలను చెరుచు చేతులేలా వచ్చాయి రా
నీ చేతులు కాల్చేయ
నీ కన్నులలో సీసం పోయ
నీ నోట్లో ఉచ్చు పోయ
నీ దానిపై కర్రు కాల్చి వాతపెట్టి
కరవాలమై నరికి వేయ
ఎందుకురా అలాంటి బతుకు భూమికి భారం
ఏదైనా విషం మింగి చావరా
ఎంత మూర్ఖంగా అయిపోయావురా
మనిషి రూపం లో ఉన్న మృగమా
నీచ నికృష్ట బతుకు నీదిరా
తూ.. నీబతుకుతూ తూ తూ తూ తూ..
అంటుంది రా ఈ జగతి
ఇక నైనా మన అమ్మలను
ఎట్లా రక్షించు కోవాలో?ఎవరు దిక్కు
ఏ గోడ వింటది ఏ మేడ వింటది
ఏ అక్షరం వింటది ఏ లక్షణం వింటది
-గుండెల్లి ఇస్తారి

అక్షరాల అర్ణవం

కపనమా!!
సదా నాతో నీడగా, క్రీనీడగా సాగుతూనే ఉన్నావు
కనుదోయి చూసే అందమంత ఆనందమై
అక్షరాల మాలికవుతావు.

శోకం తో సంతోషమెరుగని సహారా గా నేనుంటే
అక్షరాల అశ్రుధార వవుతావు.

మనసు జలపాతమై ఉల్లాసం ఉరకలు వేసినప్పుడు
నీవు లేని నా పరివాహక ప్రాంతమే లేదన్నట్లు
సప్త నదుల సంగమం లా పరవళ్ళు తొక్కుతావు.

యామిని వలయంలా నేనుంటే
చరణాల చంద్ర స్మితల
మారి నాలోశారదా సంకీర్తనలు పలికిస్తావు.

అతివ పై జరిగే అన్యాయాలు
అరాచకాలు అత్యాచారాలు చూసి మనసు మండుతున్న
అగ్ని గోళమై రుధిరాకాశం గా మారినప్పుడు
జ్వలించే అరుణారుణ అక్షరానివావుతావు

ఇలాగే
ఇలలో
నేనున్నంతవరకు నాలో ఉండిపో
అన్ని భావాలు మదిలో వొంపుకొని
పదాల పదనిసలతో
అక్షరాల అర్ణవం గా

తెలుగు సాహితీ వనంలో
వసివాడని వసంతమవుతాను

కావ్యాల లిపితో
నాకోసం
ఓ అందమైన పేజీని
లిఖించుకుంటాను

-కళ తాటికొండ
9989891558

సుమధురం మనోహరం సుస్వరాల నా తెలుగు

చ:సుమధురం మనోహరం సుస్వరాల నా తెలుగు
సిరి వెన్నెల వెలుగు రేఖ దివ్యమైన నా తెలుగు
గలగలమని ప్రవహించే గంగాజలవాహిని -2
అజంతమై అలరారు అమృత సంభాషిణి
॥సుమధురం॥
ప:విరిసిన మరుమల్లెల నవ పరిమళము ప్రతి పదము
హృదయ వీణ తంత్రుల శ్రుతి నాదమె ప్రతి పలుకు
భవ్యమైన భావాల పద సంపద తేట తెలుగు-2
మృదు పదముల మధు కలశం తెలుగు భాష వైనము
॥సుమధురం॥
చ:ఆది కవి నన్నయ వ్రాసె తొలి తెలుగు కావ్యము
ప్రసరించెను భక్తిరసము పోతన కవి భాగవతము
పాల్కురి సోమనాథ జాను తెలుగు ప్రవాహం-2
అల్లసాని అల్లిక పదకవితా విన్యాసం
॥సుమధురం॥
చ:పద్య రచన సౌలభ్యం తెలుగు భాష నైపుణ్యం
నవనాడులు స్పందించును పలుకాడగ తెలుగు భాష
యాభైయారు అక్షరాల పొందికలో వైవిధ్యం-2
శబ్దాలంకారములతో ప్రకాశించు తెలుగు భాష
॥సుమధురం॥
చ:పరభాషను గౌరవించు తప్పులేదు సోదరా
తెలుగులోన మాటలాడు ఎప్పుడైనా ముదముగా
తెలుగు ప్రజల ఆత్మ గౌరవమే తెలుగు భాష-2
తెలుగు భాష సంపదను కాపాడుట మన ధర్మం
॥సుమధురం॥

-డా.దాసరి శ్రీనాథ్ గౌడ్
7780143871

అంతా తెలుగుమయం

తెలుగు తల్లి
పిలుస్తున్నది
తెలుగు తీపిని
తినిపిస్తున్నది.

తెలుగు దీపాలు
వెలుగుతున్నాయి
తెలుగు కాంతులు
ప్రసరిస్తున్నాయి.

తెలుగు గాలులు
వీస్తున్నాయి
తెలుగు అక్షరాలు
వ్యాపిస్తున్నాయి

తెలుగు మేఘాలు
కురుస్తున్నాయి
తెలుగు పదాలు
ప్రవహిస్తున్నాయి

తెలుగు గళాలు
తెరుచుకుంటున్నాయి
తెలుగు పాటలు
తన్మయపరుస్తున్నాయి.

తెలుగు నదులు
ప్రవహిస్తున్నాయి
తెలుగు జలాశయాలు
పొంగిపొర్లుతున్నాయి.

తెలుగు సేద్యము
కొనసాగుతుంది
తెలుగు పంటలు
పండుతున్నాయి

తెలుగు అందాలు
ఆరబోస్తున్నాయి
తెలుగు మోములు
వెలిగిపోతున్నాయి

తెలుగు పువ్వులు
పొంకాలుచూపుతున్నాయి
తెలుగు సౌరభాలు
విరజిమ్ముతున్నాయి.

తెలుగు కవితలు
జాలువారుతున్నాయి
తెలుగు కవులు
మురిపిస్తున్నారు.

తెలుగు భాషకు
పట్టంకడదాం
తెలుగు జాతికి
ఖ్యాతినితెద్దాం

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

"అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఫేస్బుక్ గ్రూప్ లో నిర్వహిస్తున్న "వారం వారం వచన కవితల పోటీ"లలో ఎంపికైన "ప్రపంచ శాంతి" పై మంచి కవితలు...

శ్వేత కపోతాలు ఎగరాలి

కమ్ముకున్న కారుమబ్బులు
వాన చినుకులను కాదు
అణ్వాయుధాల నిప్పురవ్వలను
రాలుస్తున్నాయి?.
మతోన్మాద పైశాచికత్వపు
హోమగుండంలో మగువల మానాల
సంతర్పణలు జరుగుతున్నాయి?.
రాజ్యాధికారం తలకెక్కిన మైకం
చిందించిన రుధిర ప్రవాహంలో
మాంసఖండాలు తెప్పల్లా తేలుతున్నాయి?.
ప్రపంచ పటంలో ఎటు చూసినా
రగులుతున్న రావణ కాష్ఠాలే
భయం గుప్పిట్లో వణుకుతున్న ప్రాణాలే?.
బొబ్బలెక్కిన అవని తల్లి దేహం మీద
నవనీతాన్ని పూసే రోజు రావాలంటే
అహింస నేపథ్యం ఇంటినుంచే మొదలవ్వాలి?
ప్రతి పౌరుడు ప్రపంచ శాంతికి నడుము కట్టాలి...
అగ్ర రాజ్యాల ఆధిపత్యం కట్టలు తెగుతుంటే
సరిహద్దులు దాటాలనే రాజ్య కాంక్ష హద్దులు దాటుతుంటే
అణచివేతకు చూపుడు వేలి మీద చుక్క, శూలం కావాలి?
యుద్ధ కాంక్షలేని నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలి...
స్వార్థం మరచి శాంతికోసం దేశాలు ఐక్యం కావాలి
దేశాల మధ్య అంతరాలకు చరమ గీతం పాడాలి
శ్వేత కపోతాల బారుల యవనిక మాటున
సూరీడు ఎర్రదనం చంద్రుని చల్లదనమై
పండు వెన్నెల కాంతులు జగతిని పరుచుకోవాలి
ఎరుపు కనరాని లోకం ఎదురుగా ఆవిష్కరించబడాలి.

–శింగరాజు శ్రీనివాసరావు, ఒంగోలు

కొత్త యుద్ధం

అమ్మా శాంతీ
ఎక్కడున్నావ్ తల్లీ,
ఏమైపోయావు ?.
ఆయుధాల వేటగాడు పన్నిన వలలో
రక్త సిక్త మైన పావురంలా చిక్కుకున్నావా?
సరిహద్దుల్ని ఆక్రమించే
రాజ్యాధికార కాంక్షా చట్రంలో
నలిగిన ఇరుసులా విరిగిపోతున్నావా?
ఆధపత్యపు కోరలు చీల్చిన ప్రపంచ పటంలో
నెత్తుటి గాయాల క్షత గాత్రవై
రక్తపు మడుగులో పడివున్నావా?.
అమ్మా శాంతీ,
నిన్ను కాపాడుకోవటానికి
నడుం కట్టిన సామాన్య జన సైన్యం
నీకోసం గాలించని చోటులేదు తల్లీ,
పగలు సూర్యుడ్ని, రాత్రి చంద్రుడ్ని
దివిటీలుగా చేసుకుని
కదులుతున్న శాంతి సైన్యం
నిను తప్పక వెతికి పట్టుకుంటుంది...
ఏదో వొక రోజు
దేశాల సరిహద్దుల్ని విశాలం చేసుకుని
మానవులందరినీ
ఒకటిగా కలుపుకుపోయే నాయకత్వాలనే
ప్రపంచం కోరుకునే కాలమొకటి తప్పక వస్తుంది
ప్రపంచ శాంతి కాముకుల చేతుల్లో
అహింస, సౌభ్రాతృత్వాలే ఆయుధాలుగా
కొత్త యుద్ధ మొకటి తప్పక మొదలవుతుంది.

–చిత్తలూరి

ప్రపంచ శాంతి

జనం లేని దేశంలో
ఏ బావుకుందామని!
వట్టి మట్టి తింటావా
విజయం నాదే అంటావా?.
పౌరు లందరిని చంపి
పోగేసుకుంటావా శవాలను!
ప్రాణాలను తీసేసి
పాతేసుకుంటావా జెండాలను!.
పెద్ద వాణ్ణి నేనంటూ
యుద్ధభేరీ మోగిస్తావా!
గద్దె చూసుకుంటు
కలకాలం ఉంటావా!
చావే రాదంటావా?.
చరితలోన హీనుడవే
చచ్చినాక పీనుగవే..
చమర్పవులే ఏ కన్నులు...
చరిత్ర చెప్పు పాఠ మిదేగా..
తాత్కాలిక విరుడవై
తీయగలవు ప్రాణాలను..
తరము లెపుడు మన్నించవు
తరతరాల చరిత ఇదే....
శ్మశానాన్ని ఏలుకుంటావా..
బూడి దంతా పూసుకుంటావా.
శవాల గుట్ట చూసి
మురిసిపోతావా...
గెలిచానని చెప్పుకుంటావా.....
రాయికో రప్పకో,
రగులుతున్న నిప్పుకో
బలియైన బిడ్డకో
చెక్కలు తెగిన కపోతానికో చెప్పుకో..
గెలిచానని చెప్పుకో.. చెప్పుకో..

–మేడిశెట్టి యోగేశ్వరరావు, సియాటెల్, అమెరికా

ప్రపంచ శాంతి

యుద్ధాలు చేసిన గాయానికి
చరిత్ర గుండెల నుండి ఇంకా
రక్తం స్రవిస్తూనే వుంది!.
క్షత గాత్రులతో, శవాలతో
వేదనలు రోధనలతో పోటెత్తిన అవనితల్లి గుండె
ఆ చేదును దిగమింగుకొంటూ..
ఇప్పుడిప్పుడే పచ్చగా మొలకేత్తుతుంది...
ఇంకా ఆ క్రూరమైన అశాంతి జాడలు మన కెందుకు..
మరణ శాసనం వ్రాసే యుద్ధదారి మన కెందుకు..?!
వేవేల మేకవన్నె పులులు లోకంలో
ఆకలి తీర్చుకోనే మార్గంలో అనేకానేక పన్నాగాలు
ప్రజల శాంతిని చెదరకొడుతూ..
తిప్పికొడదాము ఆపన్నగాలను
చెయ్యెత్తి జై కొట్టక!!
ఊరు వాడ ఏకమై
చిన్నా పెద్ద చేతులు కలిపి
శాంతి స్థాపనకు పునాదులు వేద్దాము.
ఇంట గెలిచి రచ్చ గెలుద్దాము
మానవత్వాన్నే తైలముగా చేసి
శాంతి ప్రమిదలు వెలిగిద్దాము
ఈర్ష్యాద్వేషం పగా
ప్రతీకార అంధకారములను పారద్రోలుదాము,
ప్రపంచ శాంతికి
వెలుగు కిరణాలమై ప్రభవిద్దాము!!.

–ముంతాజ్ బేగం, ఏలూరు

దమ్ముందా !?

బంకర్ లో బందీగా దాగి,
తూటాల చప్పుళ్ళు వినలేక
రక్తం స్రవిస్తున్న చెవులు మూసుకొని
కన్నీరుతో దాహం తీర్చుకుంటూ
ఆకలి మరచి,
సక్కిసక్కి మూలన కూర్చుంది
బిక్కుబిక్కుమంటూ....
తళుకు బెళుకుల మిరిమిట్లు గొలిపే
కాంతుల మధ్య, ..
మాదకద్రవ్యాల తూగులాటల సరసన
దేశాన్ని దేవదాసిగా మారుస్తున్న
శాంతి కాముకులను చూసి,
బ్రతుకు భయంతో
బంకర్‌లో దాగి ఉంది ...
దమ్ముందా!?
ధైర్యం చెప్పి బయటకు
తీసుకువచ్చే సత్తా నీకుందా?
లేనప్పుడు ప్రపంచ శాంతిని అక్కడే ఉంచేద్దాం ..
కనీసం ప్రాణమైన ఉంటుంది
అప్పుడప్పుడు కాస్త శాంతి మలాంపట్టి వేస్తూ
ప్రపంచశాంతి కాపాడే వారసులము మేమే
అంటూ ప్రతి ఏటా జరుపుకుందాం
ప్రపంచశాంతి దినోత్సవం.

–శరకణం కనకదుర్గ

ప్రపంచ శాంతి

నెత్తురోడుతున్న తెల్లని పావుర మొకటి
తలదాచుకొను తావులేక తల్లడిల్లుతుంది...
పురుడు పోసుకున్న ఆధిపత్యపు భావమేదో
అస్థిరతను రగుల్కొల్పుతూ
దావానలమై ప్రేమ వనాన్ని దగ్గం చేస్తుంది...
జాతి వైషమ్యాల రక్కసొకటి త్రివిక్రమ పాదమై
మానవత్వాన్ని పాతాళానికి తొక్కేస్తూ
మనుగడను అపహాస్యనీ చేస్తుంది.
ఒకరి కొకర మంటూ చేసుకున్న బాస లన్నీ
నీటి రాతలై పచ్చటి బ్రతుకులను
రక్తాక్షరాలతో లిఖిస్తున్నాయి...
ప్రేమ విరులు పరిమళించవలసిన భూమిని
అణ్వాయుధాలు పాలిస్తూ,
తీవ్ర వాదానికి,అనైక్యతకు ఆజ్యం పోస్తున్నాయి...
జరుగుతున్న మారణ హోమాన్ని నిరసిస్తూ..
మన దైన స్వరాన్ని ప్రతిధ్వనింపచేస్తూ..
సరిహద్దు లనేవి దేశాలకు మధ్య మాత్రమే నన్న
ఇంగితాన్ని ఒంటబట్టించుకుంటూ
మానవత్వమే మన మతమై..
బహుజన హితమే లక్ష్యమై..
సమరస భావనలు పండించుకునే
హోలికులమవుదాం...
ఉగ్ర వాదాన్ని, ఉన్మాదాన్ని
వర్ణ వైవిధ్యాలను, ఆర్థిక అంతరాలను
విశ్వానికి ఆవలగా విసిరేసి,
శాంతి కపోతానికి
మానవత్వపు మూలికలతో ఉసురులు నింపి
విశాల గగనంలో స్వేచ్ఛగా ఎగురవేద్దాం..
ప్రపంచ మంతా పల్లవించే
ప్రేమానురాగాలను ఆలపిద్దాం..

–మైథిలి, గుంటూరు

ప్రపంచ శాంతి

ఆలోచనలన్నీ స్వార్థాలే,
అవసరాలన్నీ ఆర్థికాలే,
బంధాలన్నీ నాటకాలే,
మనసులన్నీ మారణాయుధాలే,
ఇంకెక్కడి ప్రపంచశాంతి!.
యుగాది నుండి యుగాంతం వరకు
యుద్ధాల మధ్య విరామమే శాంతి...
విజ్ఞానాన్ని వినాశనానికి వాడుకునే
శాంతి కాముకులు,
మనవాడు కాని ప్రతివాడినీ చంపేయ మనే
ప్రేమ మూర్తులు,
గాలి సోకితేనే మైల పడతామనే
మానవతా మూర్తులు,
ఇంకెక్కడి ప్రపంచశాంతి...
ఎండమావి నీళ్లతో దాహాన్ని తీర్చే
దగాకోరు నాయకులు...
రక్త వర్షాన్ని ఇచ్చే యుద్ధ మేఘాలు.
శవాలుగా మారుతున్న శైశవ గీతికలు.
అణు బాంబు లవుతున్న కడుపు మంటలు.
లాభాల పంట పండించే కురు క్షేత్రాలు...
చివరాఖరి మనిషి చితి మంటలపైనే,
ప్రపంచ శాంతి కపోతాన్ని ఎగరవేయాలి ఏమో?
మరు జన్మంటూ
మరో గ్రహంపై ఉంటే,
కుల మతాలు తెలియని!
అహేలు, ఆధిపత్యాలు లేని!
కల్మషము కాఠిన్యం తెలియని,
రేపటి మందారాలను పూయిద్దాం.

–ఎనికేపల్లి శివకుమార్

శాంతి పిట్ట

అన్యాయం ప్రబలి
అడగంటుతున్న మానవత్వం
అణ్వాయుధాలను భుజాన మోస్తూ
ధర్మాన్ని కబళిస్తుంటే
కనుచూపు మేరలో కానరాని కారుణ్యం
ఏ దిక్కున రెక్కలు విరిగిన
పిట్టయి కూర్చుందో..!!
తమ ఇజాలే నిజాలని చెప్పే నాయకుల మాటలు
ఉనికి లేని ఉల్లి పొరలై ఎగిరిపోతూ
ప్రపంచ శాంతిని మసకబారించాయి..!!
ప్రపంచం ఆధిపత్య పోరుతో,
వర్ణ వైషమ్యాలతో అట్టుడికిపోతుంటే...
ఉరుముతున్న కాలాన్ని ఊరడించలేక
శాంతి పిట్ట రెక్కలల్లార్చుతుంది..!!
నైతిక మద్దతే మనిషి మనిషికీ
వారధంటూ శాంతి గంటని మోగిద్దాం..!!
పొరుగు దేశాలతో పొత్తు
ప్రపంచ శాంతికి మూల మంటూ
ఆలోచన ప్రమిదలో వెలిగించిన
సామరస్యపు దీపం విశ్వశాంతికే వెలు గంటూ..
ఓ చలనం లేని ఘడియలో
ప్రపంచాన్ని భళ్లున తెల్లారనీ..
ఆ వేకువలో పిట్ట గొంతు
ఓ పాంచజన్యమై ధ్వనించనీ..
అశాంతి, తోక చుక్కయ్ రాలనీ..
ఎగిరిపోతున్న శాంతి పిట్టను ఒడిసిపట్టి
ప్రపంచపు పొత్తిళ్ళల్లో నేదదీరనీ..!!
ఏ దేశమైనా .. ఏ దేహమైనా...
భ్రాంతితో కాదు...భ్రమతో కాదు..
శ్రమతో కూడిన సౌఖ్యాన్ని..
శ్వేత కపోతమై
ప్రపంచమంతా విహరించనీ..!!

–జయసుధ కోసూరి, ఏలూరు

సూక్ష్మజీవి చీమల్లో

కానరాదు అనైక్యత,
బుద్ధి జీవి మానవునిలో
కనిపించదు సమైక్యత...
అన్నదమ్ముల్లా వుండండి అంటాము
సొంత అన్నదమ్ముల మధ్యే వివాదము
దేశాల మధ్య శాంతి అంటాము
పొరుగువారితో పోట్లాడతాము!
యుద్ధాలు నివారణ అంటాము
కుంటుంబములోనే యుద్ధాలు చేస్తాము
కలిసివుండాలి అంటాము
అమ్మనాన్నతోనే కలిసి వుండలేము!.
ప్రాంతీయ తత్వాలు, భాషా విభేదాలు!
ఉనికి కోసమేగా వీరోచిత యుద్ధాలు !.
ప్రజా కంటకాలుగా మారిన
అధికారుల అహంకారాలు!
రక్త చరిత్ర వెనుక అగుపించే
మార్ధ శిఖా మణుల నిర్ణయాలు!.
ప్రపంచ శాంతికి కావాలి
అందరమూ ఒకటే అనే భావం,
నిరాయుధీకరణ, చర్చలు,ద్వారా
మాత్రమే ప్రపంచ శాంతి సాధ్యం.

–సుబ్రహ్మణ్యేశ్వరరావు కానుకొలను

పునరుద్ధీకరణ

మనుషులే ఆయుధాలుగా మారాక
డేంజర్ బెల్ కు తీరికేది
నిన్నటి తప్పులే నేటి గురువులవుతుంటే
ఒప్పుకి గుర్తింపేది
రేపటి నవ్వులను నేడే వెలివేస్తుంటే
ఉదయాలకు అర్థం ఏది
మందు గుండ్ల విస్ఫోటన కాంతితో
భవితను వెతుకుట మూర్ఖపు పని...
అల్లర్లకు ఆతిథ్య మిచ్చి సమైక్యతను
విడగొట్టి ,
గట్టిపడ్డ దాఖలా లేవీ లేవు చరిత్రలో...
పొరుగు వారితోనే కాక సొంత గూటిలో
సొంత వారితో యుద్ధం చేస్తూ
యుద్ధ భూమి పరిమాణాన్ని కుదిస్తూ
బలహీనపడుతున్నది ఐకమత్యం...
నిత్య చిత్రాలుగా విరాజిల్లుతున్నాయి
ఆదిపత్యం, అణచివేతలు...
ఇలా ఓ పక్క కల్లోలానికి తెరలేపుతూ
మరో పక్క తాము పోగొట్టుకున్న
సంతోషాల ఆస్తికై ఆరా తీస్తున్నారు...
ప్రాణాంతకాలకు పురుడుపోస్తూనే
ఆనందం చిరునామా కోసం
గాలిస్తున్నారు...
కండ బలం, అండ బలంతో
విర్రవీగుతున్నప్పటికీ
పాత ప్రేయసి శాంతిని
మరువలేకపోతున్నారు...
ఇప్పటికీ తరుణం మించిపోలేదు
ప్రశాంతత అంతరించలేదు
ఇకనైనా మొదలెట్టాలి ప్రేమ,
మమతల సాగు
వెతికి మరీ వెలికి తీయవలెను
సుఖసంతోషాల గనులను...
మనసులో శాంతి స్థాపనకు
అనుకూల వాతావరణం కల్పించుకుంటే
శాంతి కపోతాలతో పని పడదు
శాంతి నివాసాల పునరుద్ధీకరణ

సుదూరపు కాంక్ష

పదవీ కాంక్షను ఏపుగా పెంచేసుకుంటూ
అధికారం మధంతో
అమాయక ప్రజలపై
వ్యాఘ్రములై దూకుతుంటే
ఎదురుదాడికి దిగితే
బక్క చిక్కిన ప్రాణాలు బిక్కు బిక్కుమంటూ
రేపటి ఉదయం కోసం ఎదురుచూస్తున్నాయి..
ఆధిపత్యపు పోరులో
ఆయుధ బలాన్నినిరూపించటం కోసం
బాంబుల వర్షం కురిపించి
భయ భ్రాంతులకు గురిచేస్తూ
పైశాచికత్వం పొందుతూ
గుండెల్లో పగలను రాజేసుకుంటూ
పెదవులపై శాంతి పూలు వికసింపజేస్తూ
రాక్షసతత్వాన్ని పెంచుకుంటున్నారు...
మత మారణ హోమాలను రాజేయకుండా
అధికార దర్పాన్ని పగలుగొట్టి
సౌభ్రాతృత్వపు జ్వాలలు
ప్రతి హృదయంలో వెలిగించుకొని
సామరస్యంగా మాటల అల్లికలు అల్లుకుంటూ
ప్రపంచశాంతికి నీ ఇంటి నుండే
శ్రీకారం చుట్టిచేయి చేయి కలిపి
శాంతి కపోతం ఎగరవేయాలి
ఆకాశం వైపుగా!.

–చింతా రాంబాబు

వారే తలిస్తే "వారే"

భూమిపై పెద్ద దేశాల దౌర్జన్యం
బడా దేశాధినేతల కర్ర పెత్తనం
వదలరు ఆధిపత్యపు "పోరు"
తమది అధిక పైత్యమని "వాపోరు"...
గోముఖ వ్యాఘ్రాలు
వృషభ ముఖ మహిషాలు
ఆయుధాలు పండించే వ్యవసాయదారులు
ప్రక్కవారికి "వ్యయ" "సాయ" దారులు...
వారే తలిస్తే "వారే" మరి...
అణ్వాయుధాల సంపాదనలపై
సింహాసనం వేసుక్కూర్చుంటారు,
తెల్ల జెండాను పట్టుకొని
తెల్ల పావురాలను ఎగరేస్తుంటారు...
ప్రస్తుతం మానవుడి బ్రతుకు
భూమిపై బితుకు బితుకు
ఎప్పుడు యుద్ధ మేఘాలు
కమ్ముకుంటాయో నని
ఎక్కడ బాంబుల వర్షం కురుస్తుందో నని
ఏ విధంగా ప్రేలుళ్ళ పిడుగులు
పడతాయో నని...
ఎదురుచూద్దాం
ఈ చీకటి ఆలోచనలు తొలగి
పుడుతుందని ఒక వేకువ
ఉషోదయపు కాంతి,
ఆశించుదాం అంతా
వసుధైక కుటుంబమై
వెల్లివిరియాలని భూమిపై ప్రపంచ శాంతి!

–గొలి హనుమచ్ఛాస్త్రి

మహాభాగవతం 'ఆరవ స్కందం సింగనామాత్యుడి రచనే'

మురళీధరరావును సన్మానిస్తున్న వంశీ రామరాజు, వేదికపై గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, శ్రీ పేరి

బమ్మెర పోతనామాత్యుడు తెలుగువారికి చాలా ఇష్టమైన మహాభాగవతం రచించారని ప్రచారంలో ఉందని కానీ ఆరవ స్కందంను రచించిన వారు ఏర్పూరి సింగనామాత్య కవి అని కొందరికే తెలుసునని ప్రముఖ విద్యావేత్త, పరిశోధకుడు, డా॥ ఏర్పూరి మురళీధరరావు అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో నెలనెలా తెలుగు వెన్నెలలో భాగంగా సాహిత్య ప్రసంగాల కార్యక్రమం జరిగింది. డా॥ మురళీధరరావు మహాకవి ఏర్పూరి సింగనామాత్యుడు గురించి ప్రసంగం చేశారు.

'జమిలిపోగు' ఆవిష్కరణ

జమిలిపోగు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న కుప్పిలి పద్మ, నాగసూరి వేణుగోపాల్, రామ్మోహన్, సజయ, విజయ్‌కుమార్ తదితరులు.

రచయిత రుబీనా పర్వీన్ రాసిన జమిలిపోగు కథా సంపుటిని ఆవిష్కరణ ఆదివారం రాత్రి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సీనియర్ పాత్రికేయుడు జీఎస్ రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ, సీనియర్ పాత్రికేయుడు నాగసూరి వేణుగోపాల్, సామాజిక కార్యకర్త సజయ, ప్రముఖ కవి కె. విజయ్‌కుమార్ తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకలోని కథలు సంపదను సృష్టించేలా భరోసా, ధైర్యం ఇచ్చేలా ఉన్నాయని కుప్పిలి పద్మ అన్నారు. ఈ పుస్తకాన్ని తన తల్లికి అంకితం ఇస్తున్నానని రచయిత రుబీనా పర్వీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము

సుప్రసిద్ధ పాత్రికేయులు
డి.ఎన్.ఎఫ్. వ్యవస్థాపకులు
వయోధిక పాత్రికేయ సంఘం వ్యవస్థాపక ఉపాధ్యక్షులు
శ్రీ వి. హనుమంతరావు గారి
శత జయంతి
వేదిక :
ప్రెస్ క్లబ్, సోమాజిగూడ, హైదరాబాద్
ఆగస్టు 30, శుక్రవారం
సమయం : ఉదయం గం.10.30 ని॥లకు
ముఖ్య అతిథి :
శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ
ఆత్మీయ అతిథులు :
శ్రీ కె.వి.పి. రామచంద్రరావు
రాజ్యసభ మాజీ సభ్యులు
శ్రీ పరకాల ప్రభాకర్
ప్రముఖ విశ్లేషకులు
శ్రీ ఎన్. వేణుగోపాల్
వీక్షణం సంపాదకులు
సభాధ్యక్షులు
దాసు కేశవరావు, అధ్యక్షులు
వయోధిక పాత్రికేయ సంఘం
సతీష్ బాబు
జర్నలిస్ట్ డైరీ
కె. లక్ష్మణరావు, కార్యదర్శి
వయోధిక పాత్రికేయ సంఘం
పాత్రికేయులు అందరికీ సాదర ఆహ్వానం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1236వ రోజు 'ఉదయం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఉదయం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
–డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

విరామనీ లేని పయనం

అదే కొబ్బరి చెట్టు
నిటారుగా నిలబడివునీది
సూరీడు కొమ్మలోంచి
కొంచెం అటు ఇటుగా
రోజు దర్శనమిస్తాడు
దానిపక్కనే
పిచ్చిపూలు తలపైకెత్తి చూస్తాయి
నాకు అప్పుడు ఉదయమవుతుంది
రోజూ అదే పాలగిన్నెలోంచి
పాలవాడు
నీళ్ళు కలిపి పాలని పోస్తాడు
అప్పుడు మొహం కడుక్కున్న
అనుభూతి నాకు
కాఫీ వాసనతో
సగం మత్తు వదిలిపోతుంది
కడుపులో పడ్డాక
మత్తు వదలరా
అన్నపాట జ్ఞాపకమొస్తుంది
బాత్ రూంలో
నీళ్ళు ఒంటిమీద పారుతుంటే
పాపపు నిద్ర కడిగేసుకున్నట్టు
అవుతుంది
నాలుగు ఇడ్లీల నడుం విరగొట్టి
ఉనీటే సాంబారు
లేకుంటే చట్నీతో రుబ్బేసి
కబంధ రాక్షసుడిలా నమిలేయడం.
విసుగెత్తని సూరీడిలా
మళ్ళీ ప్రయాణం
విరామనీ లేని
బతుకు బండిని తోసుకుంటూ
అరిగిన రెండు కాళ్ళకు
చక్రాలను అమర్చుకొని
ఓపిక ఇరుసును
జీవన బండికి అమర్చుకుని
అత్యంత చాకచక్యంగా
అన్నీ సర్దుకొని
నూతన ఉదయం కోసం
మళ్ళీ రోడ్డున పడడం.
ఎప్పుడు వచ్చిందో నాలో ఈ మార్పు
నాకు తెలియకుండానే ఉత్సాహం
మళ్ళీ మొదలు
ఉరుకుల పరుగుల భాగోతం
మెట్లు దిగి వీధిలో పడితే
మళ్ళీ ఎప్పుడొస్తాడో ఈ మానవుడని
అమ్మలా యెదిరిచూసే
నాది కాని నా ఇల్లు
క్షేమంగా తిరిగి రమ్మని
ఆశీర్వదించే నావీధి
నాకు రోజూవచ్చే ఉదయమది
విసుగు విరామనీ లేని పయనం నాది.

–కందుకూరి మనోహర్

ఉషోదయం

అరుణారుణ కాంతుల
తొలి వెలుగులు
అల నీలి గగనంలో
తూరుపు పొద్దున
అలనల్లన మెల్లగా
దినకర కరుణారుణ
కరముల దీవెనలందించగ
అంబుజ జలజములు
ఆరాధనలర్పించగ
జగతికి మేల్కొలుపుల రాగం
జాగృత చైతన్యానికి
జీవన తరంగం..
కలకల కిలకిల రవముల
విహగముల గగన విహారం
గలగలపారే ఏరుల
సెలయేరులు ఝరులై పారే స్వచ్ఛతలు
మురిసీ ఎగసే అలల
నదీమతల్లుల పరవశ మాధుర్యాలు
ముదముగ ముద్దుగా విరిసిన
మల్లెల చేమంతుల పూబంతుల
కవ్వింతలు
పూబాలలు పురి విప్పిన
పుడమి తల్లికి
మది నర్పించే విరుల నీరాజనములు..
కొండల కోనల్లో
కొమ్మల ఊయలలూగే
మలయ మారుతములు
స్వర సుర రాగాల పల్లకిలో
అనురాగాల మురిపాల
మురళీ స్వరాలు

పరవశమే ...

పరవశాల మనసు నీ సొంతమైతే
ప్రతి ఉదయమూ పరమానందమే
సరిగమల రాగ సరాగాలే
శుకపికముల సౌందర్యాలే.
సన్నని పవనవీచికలకు తలలూపే
గరిక వనంపై గమ్మత్తుగా
ఆవరించిన తెలి మంచు పూలు
భానోదయంతో
విచ్చుకుంటున్న విరులు
పశు సంపదల అంబారవములు
లేగదూడల హుషారు పందేరములు
గుడిలో సుప్రభాత రాగములు
బడిలో గణగణ గంటల మోతలు.
గుక్కతిప్పుకోని అమ్మలక్కల
ముచ్చట్లు
గునపం పార
పనిముట్లతో పనికెళ్ళే శ్రామికుడు
నాగలితో కేకేసే హాలికుడు.
గాలి ఈలల గమ్మత్తులు
మేఘమూదిన మురిపములు
నీటి ప్రవాహంలో మిలమిలలు
మీనముల దుముకులాటలు .
పాప నవ్వుల పరిమళాలు
కొమ్మ రెమ్మలూగిన పరవశాలు
గొల్ల కేకల శ్రావణ సంగీతం
పోలికేకల ఆనందం.

– నగునూరి రాజన్న

విరంచి విరచించిన
సృష్టికి మూలం
శక్తి స్వరూపం
ప్రకృతి అందించిన ప్రణవ స్వరూపం
పరవశ స్వర రాగాలతో
జగతికి అందించిన ప్రణయ కావ్యం..

–పద్మావతి పి.

తొలి పొద్దు పొడుపు

శ్రావణ మేఘాలు
జలతారు వెండి తళుక్కు
నడుమ నక్కి నక్కి
తొంగిచూసే తొలి పొద్దు
వెలుగుల గిలిగింతలు
కదిలే ప్రకృతి ఉదయం.
నును వెచ్చని కౌగిలికై
తన్మయత్వ దోబూచులాట భానునికి
జలతారు అంచుల అందాల వెలుగులు
వెతుకులాడే ప్రకృతి.
ఆ పరిష్వంగంలో సుతి మెత్తని కదలిక
సర్వ జీవులకు సంకేత మధురిమ
ఆ సంగీత జావళీలు
జారెడు పిల్ల తెమ్మెరల
సవ్వడి మేలుకొలుపు
రమణీయ రాక నవ్యజగతికి
కొత్త ఉత్తేజం కొంగు బంగారం
సుప్రభాత గీతికాలాపన.

–కె.కె.తాయారు

విజయోదయం

రేపటి ఉదయం కోసం ఆశ
రాక తప్పదనే భరోసా
ఎన్నో ఎన్నెన్నో ప్రణాళికలు
ఇంకెన్నో అత్యవసర పనులు
ఆలోచనల సుడిగుండాలను ఈదుతూ
రేపటి ఉదయం కోసం నిరీక్షణ.
నేటి ఉదయం ఏమిచ్చిందో
ఎంతవరకు సద్వినియోగమైందో
ఎక్కడో గెలిచావో
ఎలా ఓటమి చెందావో
మననం చేసుకున్నావా...?
నీకు నువ్వు మార్పైనా చెందావా..?.
రేపటికై వేచే ముందు
గడిచిన నిన్నటి గురించో
అంతకు ముందు కరిగిన
కాలం గురించో
ఆలోచనేమైనా చేశావా?
కూడికలు తీసివేతలేమైనా గమనించావా?
విజయాలే సాధించి ఉంటే
ఎవరి సహకారంతో
అపజయం పొందితే
కారణమేమిటో
బేరీజు వేసుకున్నావా?
ఏదో అలా గడిచిపోయిందని గతాన్ని
మరిచిపోవాలనుకుంటున్నావా?.
ఐతే.. రేపటి ఉదయం నీకు
కొత్తగా ఎలా ఉంటుంది...?
లేచామా
తిన్నామా
పడుకున్నామా
ఇంతకు మించి
ఉదయంలో తేడా ఏముంటుంది..?
అన్నింటి మాదిరే
అదీ చీకట్లో కలిసిపోతుంది.
నీకు నువ్వు తెలుసుకొని
నీ శక్తిని పెంచుకొని
రుజు మార్గాన్నెన్నుకుని
చేసే పనిలో గెలుపు కోసం పోరాడు
చేసిన పోరాటంలో
లోపం లేక ఓడినా
ఆరోజు విజయం నీదే
రేపటి ఉదయం
నిద్రలేపేదీ నీగెలుపుకే!.

–గుర్రాల వేంకటేశ్వర్లు

నవోదయం

నవోదయపు జలతారు బాటలో
కలల మైకం నుండి
కనుదోయి వాకిట
వెన్నెల సోనల తెరమరగు
ఉషః కన్య
ఆకాసపు కెన్వాసుపై
లేత కిరణాలను ప్రసరిం పజేస్తూ
సెలయేటి గలగలలో
విచ్చుకుంటున్న కమలంలా
కదులుతున్న హృదయాల సవ్వడి
అరుణ కిరణాలకాంతిలో
పక్షుల కిలకిలారావాలు
భూదేవి ఒడిని చేరుకుంటున్న
సూర్యుని ప్రకాశపు రేఖలు
దినకరుని ప్రవేశంతో
ఉరుకులు పరుగుల
పనుల సందడి
నేటి కలయికతో
అల్లరి చేస్తూ అలరించే
ఉదయపు నవవసంతం
ప్రభాత నడకలు
ధ్యాన యోగాలతో
సరిగమలగమకం తో
సుప్రభాతఆలయ కీర్తనలు
రైతన్నలు పొలంచేరే అలజడులు
ఏటి గట్టున
ఎడ్ల మెడలోని చిరుగంటల రవళి
కళ్లాపు చల్లి న వాకిట్లో
అతివల చుక్కల రంగవల్లులూ
పారిజాత పుష్పాలు
దేవతలు కురిపించే అక్షతల్లా
పూల జల్లులు
అజ్ఞాన తిమిరాంధకారాన్ని
తరిమి కొట్టి
చీకటికడుపున
కాంతిపుంజంలా
ఉషః కాంతుల ప్రజ్వలనం
ఆ ఉదయ కాంతుల స్రవంతి
మళ్ళీ మళ్ళీ వికసిత వదనంతో
ప్రతిరోజూ ఉదయించాలి.
నవోదయం
సమాజ వికాసానికి
మానవాళికి శక్తిసంపదనివ్వాలి.

–ఆర్. రమాదేవి

ఉదయం

కొందరికి
బాల భానుడి కిరణాలను
ఆస్వాదిస్తూ
వేడి వేడి కాఫీ తాగుతూ
వార్తాపత్రిక చదువుతూ
ఆనందించే క్షణాలు.
ఉదయం
గృహిణికి
పాలవాడి అరుపులు
కూరగాయల కేకలు
పనిమనిషి అంట్ల చప్పుడు
పిల్లల కొట్లాటలు
సేవింగ్ సెట్ కనిపించలేదని
భర్త వేడుకోలు
మెదడు వేడెక్కి
చెయ్యాలి భరతనాట్యం
అష్టావధానం.
ఉదయం
నిరుద్యోగికి ఉద్యోగాల అప్లికేషన్లు
వెళ్లవలసిన ఇంటర్వ్యూలు
నిరుద్యోగ జీవితం మీద
బాధ, అసహనం
విముక్తి ఎప్పుడని ఎదురుచూపులు.
ఉదయం
రాజకీయ నాయకుడికి
పదవుల భయం
ఉద్యోగికి పై అధికారులు భయం
కాంట్రాక్టర్లకు బిల్లుల భయం
విద్యార్థికి హోం వర్క్ భయం.
చెప్పుకుంటూ పోతే
ఒక్కొక్కరిది
ఒక్కొక్క రాయబడని కావ్యం
ఉదయం కానే కాదనుకోవడం
నిరాశ
ఉదయించి
అలాగే ఉండాలనుకోవడం దురాశ.
ఉదయించాలని కోరుకోవడం ఆశ
అన్నాడో మహాకవి
ప్రతి ఉదయం
అందరికి కొత్త